ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

గరిష్ఠం 29.0
కనిష్ఠం 23.2



నల్లగొండ

5

సోమవారం 26 ఆగస్టు 2024

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	590 (312.5050)	37,882	48,818
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	643.40 (4.04)	1087.14	1685.64
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	174.93 (45.67)	31,929	44,586

చికెన్ ధరలు లైవ్ : రూ.110 | డ్రెస్ : రూ.190 | స్కిన్‌లెస్ : రూ.210



సాగర్ జలాశయంలో మట్టి, రాళ్ల మేటలు (ఫైల్)

మన్నుతిన్న కృష్ణమ్మ

తెలుగు రాష్ట్రాల అన్నపూర్ణ, ఆధునిక దేవాలయం, బహుళార్థసాధక ప్రాజెక్టు నాగార్జునసాగర్ జలాశయం రోజురోజుకూ నీటి నిల్వ సామర్థ్యాన్ని కోల్పోతోంది. రెండు తెలుగు రాష్ట్రాల్లోని ఐదు జిల్లాల పరిధిలోని ఆయకట్టులో రైతుల ఇంట సిరులు కురిపిస్తున్న సాగర్ జలాశయంలో పూడిక పెరుగుతుండటంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

\- నాగార్జునసాగర్

- పూడికతో నిల్వ సామర్థ్యం కోల్పోతున్న సాగర్ జలాశయం
- ఈ ఏడాది 112 టీఎంసీలు తగ్గిన నీటి నిల్వ
- ఏటా వందల టీఎంసీల నీరు కడలి పాలు
- ఆందోళనలో ఆయకట్టు రైతులు
- తక్షణ చర్యలు చేపట్టకపోతే భవిష్యత్ ప్రశ్నార్థకం

కృష్ణా నది 2,58,948 చదరపు కిలోమీటర్ల పొడవు కలిగి ఉండగా, పరివాహక ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే వరదతో పాటు ఒండ్రు మట్టి, ఇసుక ఏటా జలాశయంలోకి వచ్చి చేరుతోంది. అదే విధంగా నల్లమల అటవీ ప్రాంతంలో ఉన్న ఎత్తయిన గుట్టల నుంచి వరదతో పాటు రాళ్లు, రప్పలు కృష్ణా నదిలోకి వచ్చి చేరుతున్నాయి. కృష్ణా నదిలో వరద ఉధృతంగా వచ్చే సమయంలో నది తీరం కోతకు గురై చెట్లు, చేమలు, మట్టి కొట్టుకు వచ్చి ఏటా జలాశయంలో మేట వేస్తున్నాయి.

జలాశయంలో నిండుగా ఉన్నపుడు గుట్ట చెరియలు నదిలోకి కూలుతున్నాయి. ఐదు జిల్లాల నడుమ 110 చదరపు మైళ్ల పరిధిలో విస్తరించి ఉన్న జలాశయంలో వేలాదిగా పశువులు, జీవాలు, జంతు జలాలు తాగునీటికి వచ్చినపుడు ఎత్తయిన ప్రాంతాల నుంచి జారి పడే రాళ్లు నదిలో చేరుతున్నాయి. అయితే జలాశయం నుంచి మాత్రం ఒక్క తట్ట మట్టి, ఒక్క రాయి కూడా తీసింది లేదు. దీంతో పూడిక పెరిగి నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతోంది. పూడికకు నివారణ చర్యలు చేపట్టక పోతే భవిష్యత్‌లో ఎడారిగా మారే అవకాశం ఉందని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

చర్యలు శూన్యం

సాగర్ ప్రాజెక్టు నిర్మాణానికి 1955 డిసెంబరు 10న శంకుస్థాపన చేయగా, 1967లో నిర్మాణం పూర్తయింది. నాటి నుంచి నేటి వరకు 69 ఏళ్లలో పూడిక సుమారుగా 112 టీఎంసీల(శతకోటి ఘనపుటడుగులు) పైచిలుకు నీటి నిల్వలు ఉండే ప్రాంతాన్ని మింగేసింది. ఏ ప్రభుత్వం కూడా నాటి నుంచి నేటి వరకు పూడికపై దృష్టి సారించలేదు. కేంద్రం జల నిపుణుల బృందం ఐదు, పదేళ్లకోసారి పూడికపై సర్వే నిర్వహించి నివేదిక ఇసున్నా, ఎలాంటి చర్యలు చేపట్టాలో మాత్రం చెప్పడం లేదు. నాగార్జునసాగర్ జలాశయానికి గరిష్ఠ వరద ప్రవాహం 10.60లక్షల క్యూసెక్కులు కాగా, వెయ్యేళ్ల గరిష్ఠ వరద ప్రవాహం 20.60లక్షల క్యూసెక్కులు.

తగ్గుతూ వస్తోందిలా..

నాగార్జునసాగర్ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 408.24 టీఎంసీలు కాగా, పూడిక కారణంగా 2010 నాటికి 312.1456 టీఎంసీలకు తగ్గింది. 1967-1974 నాటికి 14.4 టీఎంసీల నీటి నిల్వ తగ్గగా, 1978 నాటికి 48.7టీఎంసీలు తగ్గింది. 2001-2009 నాటికి 79.21 టీఎంసీలకు నీటి నిల్వ తగ్గింది. 2009 అక్టోబరు 2, 4వ తేదీన కృష్ణా నదికి వచ్చిన భారీ వరద కారణంగా ఎక్కువ మొత్తంలో పూడిక పెరిగింది. నాడు 25లక్షల క్యూసెక్కుల వరద జలాశయానికి వచ్చి చేరింది. 2010 నాటికి సాగర్ జలాశయం నీటి నిల్వ సామర్థ్యం 96.05 టీఎంసీలు తగ్గింది. 2016 నాటికి అది 108 టీఎంసీలకు చేరగా, 2020 నాటికి 110టీఎంసీలు తగ్గింది. 2024 ఆగస్టు నాటికి సుమారు 112 టీఎంసీల పైచిలుకు నీటి నిల్వ సామర్థ్యం తగ్గి ఉండవచ్చని నిపుణుల అభిప్రాయ పడుతున్నారు.

నీటి కేటాయింపులు ఇలా..

సాగర్ జలాశయం నుంచి కుడి కాల్వకు 132టీఎంసీలు, ఎడమ కాల్వకు 132 టీఎంసీల నీటి కేటాయింపులు జరిగాయి. ఆవిరి రూపంలో 17టీఎంసీలు నీరు పోతోంది. ఈ నీటితో 22లక్షల ఎకరాలకు సాగునీరు ఇవ్వవచ్చు. కృష్ణానది డెల్టాలో వేలాది ఎకరాలకు సాగునీటితో పాటు విద్యుత్ ఉత్పాదన జరుగుతోంది. జంటనగరాలతో పాటు ఆయకట్టు పరిధిలోని ఐదు జిల్లాలోని వందలాది చెరువులు నింపి వేలాది గ్రామాలకు తాగునీరు ఇస్తున్నారు. తెలంగాణలోని ఫ్లోరైడ్ పీడిత గ్రామాలకు తాగునీరు సాగర్ జలాశయం నుంచి సరఫరా చేస్తున్నారు. ఇంత ప్రతిష్ఠ కలిగిన జలాశయంలో పూడిక చేరినా, నివారణపై ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదన్న విమర్శలు ఉన్నాయి.

పూడిక నివారణకు నిపుణుల సూచనలు

పూడికను తొలగించడం కష్టమని, కేవలం నివారణ ఒక్కటే మార్గమని సాంకేతిక నిపుణులు సూచిస్తున్నారు. వారిచ్చిన సూచనలు ఇలా ఉన్నాయి..

- జలాశయానికి ముందు మినీ ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలి.
- వరద ప్రవాహ తీవ్రత ఎక్కువగా ఉన్న చోట మట్టి నిలిచేందుకు అడ్డుకట్టలు వేయాలి.
- గుట్టల మీదు నుంచి వచ్చే వరదతో పాటు కొట్టుకు వచ్చే రాళ్లు, మట్టిని నివారించేందుకు రాతి కట్టడాలు నిర్మించాలి.
- జలాశయంలో నీరు తగ్గిన సమయంలో ప్రాజెక్టు తీరాల్లో ఉన్న ఆయకట్టేతర ప్రాంతాల్లోని మెట్ట భూముల్లోకి ఒండ్రు మట్టిని ప్రభుత్వ ఖర్చులతో తొలగించాలి.
- నది మధ్యలో ఉన్న గుట్టల చుట్టూ రాళ్లు నదిలో పడకుండా జాలీలు ఏర్పాటు చేయాలి.

పూడికపై మంత్రి ఉత్తమ్ సమీక్ష


జలాశయాల్లో పూడిక తీత పనులపై భారీ నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్ ఇటీవల సమీక్ష నిర్వహించారు. వారం రోజుల క్రితం మంత్రి ఉత్తమ్, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలిసి సచివాలయంలో నీటి పారుదలశాఖ, రెవెన్యూ, ఖనిజాభివృద్ధి శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పూడిక తీత పనులు ఈపీసీ విధానంలో చేపట్టాలని, అందుకు అంతర్జాతీయ స్థాయిలో గ్లోబల్ టెండర్లు పిలిచి పనులు పారదర్శకంగా చేపట్టాలని మంత్రులు అధికారులకు సూచించారు.

అయితే మొదటగా ఖనిజాభివృద్ధి సంస్థ జలాశయాల్లో ఉన్న ఇసుక, మట్టి నిల్వలను అంచనావేసి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా అంచనాలు రూపొందించాలని స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక శాఖపై భారం పడకుండా జలాశయాల్లో ఉన్న మట్టి, ఖనిజాల ద్వారా వచ్చే ఆదాయంతో ప్రాజెక్టుల నిర్వహణ పనులు చేపట్టాలని సూచించారు. మంత్రి సమీక్షతో సాగర్ జలాశయంలో ఉన్న 112టీఎంసీల మేర పూడికను కూడా తొలగిస్తారని ఆయకట్టు రైతులు ఎదురుచూస్తున్నారు. సాగర్‌లో పూడికను తొలగిస్తే మరో 112 టీఎంసీల నీరు రెండు తెలుగు రాష్ట్రాలకు అందుబాటులోకి వస్తుంది.

క్యూసెక్కులు అంటే..

క్యూసెక్కు అంటే క్యూబిక్ మీటర్ పర్ సెకన్ అని అర్థం. అంటే ఒక సెకను కాలంలో ప్రవహించే ఘనపుటడుగు నీరు. వెయ్యి క్యూసెక్కుల నీరు విడుదల చేశారంటే సెకనుకు వెయ్యి ఘనపుటడుగుల నీరు విడుదల చేసినట్టు అవుతుంది. ఒక క్యూసెక్కు నీటితో సుమారు 130 ఎకరాల్లో వరి పండించవచ్చు. ఒక రోజంతా కాల్వలకు 11,575 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తే ఒక టీఎంసీ నీటి నిల్వ తగ్గుతుంది. ఒక టీఎంసీ నీటితో ఏడు వేల నుంచి 10 వేల ఎకరాల్లో ఒక సీజన్ ఆరు తడి పంటలను సాగుచేయవచ్చు. ఇదే నీటితో 5,400 నుంచి 6,500 ఎకరాల్లో ఒక సీజన్‌లో వరి సాగుచేయవచ్చు. వారబందీ ప్రకారం నీటిని విడుదల చేస్తే 7,000 నుంచి 7,500 ఎకరాల్లో వరి సాగు చేయవచ్చు. అలాగే ఒక టీఎంసీ నీటితో 6.67మిలియన్ యూనిట్ల విద్యుత్‌ను ఉత్పత్తి చేయవచ్చు. 30 నుంచి 50 టీఎంసీల నీటితో హైదరాబాద్‌తోపాటు రాష్ట్రంలోని నగం ప్రాంతానికి తాగునీరు అందించవచ్చు.

మూసీ రిజర్వాయర్‌దీ అదే పరిస్థితి



మూసీ ప్రాజెక్టులో మేట వేసిన పూడిక (ఫైల్)

కేతేపల్లి: నిధుల కొరత,ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణా లోపం వెరసి రెండో నాగార్జునసాగర్‌గా పేరొందిన మూసీ ప్రాజెక్టు పూడికతో నిండుతోంది.జిల్లాలో రెండో పెద్ద సాగునీటివనరుగా ఉన్న ఈ ప్రాజెక్టు నుంచి సుమారు 30వేల ఎకరాలకు సాగునీరు అందుతుంది. ఇంత ప్రాధాన్యం ఉన్న ప్రాజెక్టుపై ప్రజాప్రతినిధులు, అధికారులు దృష్టిసారించడంలేదని రైతులు ఆరోపిస్తున్నారు. ప్రాజెక్టుకు ఉన్న స్కవర్ గేట్లు పూర్తిగా మూసి వేయడంతో వరద నీటితో కలిసి ప్రాజెక్టులోకి వచ్చే ఒండ్రు మట్టి రిజర్వాయర్‌లో భారీగా పేరుకుపోతోంది. దీంతో ప్రాజెక్టు నీటి నిల్వ సామర్థ్యం ఏటా తగ్గుతోంది. 25.25చ.కి.మీ. పరిధిలో విస్తరించి ఉన్న రిజర్వాయర్‌లో సుమారు 10అడుగుల మేర పూడిక చేరినట్టు సమాచారం.

రంగారెడ్డి జిల్లా వికారాబాద్ అడవుల్లో పుట్టి నల్లగొండ జిల్లా మీదుగా ప్రవహిస్తున్న మూసీ నదిపై సూర్యాపేట మండలం సోలిపేట వద్ద ఉన్న రెండు గుట్టల మధ్య రూ.2.20కోట్ల వ్యయంతో 1954లో మూసీ ప్రాజెక్టు నిర్మాణం ప్రారంభించగా, 1963లో పనులు పూర్తయ్యాయి. ఈ రిజర్వాయర్‌లో సోలిపేటతో పాటు కేతేపల్లి మండలంలోని బొప్పారం గ్రామాలు మునిగాయి. జలాశయంలోకి చేరే పూడికను బయటకు పంపేందుకు వీలుగా 10 స్కవర్‌గేట్లు, వరద నీటిని దిగువకు వదిలేందుకు 8 క్రస్ట్ గేట్లు, 12రెగ్యులేటరీ గేట్లతో ప్రాజెక్టును నిర్మించారు. 645అడుగుల (4.46 టీఎంసీలు) నీటినిల్వ సామర్థ్యంతో ఈ ప్రాజెక్టుకు నాటి ఇంజనీరింగ్ నిపుణులు రూపకల్పన చేశారు. 10 స్కవర్ గేట్లు, 12 క్రస్ట్, 8 రెగ్యులేటరీ గేట్లతో ఈ ప్రాజెక్టును నిర్మించారు. దశాబ్దాల తరబడి ప్రాజెక్టు ఆధునికీకరణకు నోచుకోకపోవడంతో ప్రాజెక్టు నిర్మించిన నాడు ఏర్పాటు చేసిన గేట్లు తుప్పుపట్టి పోయాయి. ప్రాజెక్టు నిర్మించిన నాటి నుంచి గేట్ల నిర్వహణకు నిధుల కేటాయింపు అరకొరగానే సాగింది.

దీంతో 1987లో మూసీకి వచ్చిన వరద తాకిడికి 8వ నెంబరు స్కవర్ గేటు కొట్టుకుపోయింది. ఆ తర్వాత శిథిలావస్థకు చేరిన స్కవర్ గేట్లను కాంక్రీట్‌తో పూర్తిగా సీజ్ చేశారు. మరమ్మతుకు గురైన 12 క్రస్ట్, 8 రెగ్యులేటరీ గేట్ల స్థానంలో సుమారు 24ఏళ్ల తరువాత 2014లో కొత్త గేట్లు అమర్చారు. ఈ ప్రాజెక్టు ద్వారా ఉమ్మడి నల్లగొండ జిల్లాలోని నకిరేకల్, సూర్యాపేట, మిర్యాలగూడ, నల్లగొండ నియోజకవర్గాల పరిధిలోని 40 గ్రామాలకు చెందిన 41,800 ఎకరాల్లో వానాకాలంలో వరి పంట సాగుకు నీటిని అందించేలా లక్ష్యాన్ని నిర్దేశించారు. ఆశించిన మేరకు వరదనీరు ప్రాజెక్టులో చేరకపోవడంతో 1973లో దీన్ని యాసంగిలో ఆరుతడి పంటలకు నీటిని అందించే ప్రాజెక్టుగా మార్చిన అధికారులు సాగు విస్తీర్ణాన్ని 33 వేల ఎకరాలకు కుదించారు. ప్రాజెక్టును నిర్మించిన తొలినాళ్లలో నాలుగు నియోజకవర్గాల్లోని 45వేల ఎకరాలకు సాగునీరు, సూర్యాపేట పట్టణానికి తాగునీటిని అందించిన ఘన చరిత్ర ఉన్న ఈ ప్రాజెక్టులో పూడిక చేరడంతో నేడు కేవలం 30వేల ఎకరాలకు సైతం నీటిని అందించలేని దుస్థితికి చేరింది. పూడికతో నిండి నీటినిల్వ సామర్థ్యాన్ని కోల్పోయిన మూసీ ప్రాజెక్టులో పూడిక తొలగించి పూర్తిస్థాయిలో నీటినిల్వకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు, రైతు సంఘాల ప్రతినిధులు కోరుతున్నారు.

బీసీ రిజర్వేషన్లను 42శాతానికి పెంచాలి

బీసీ సంక్షేమసంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య



సమావేశంలో అభివాదం చేస్తున్న నాయకులు

నల్లగొండ టౌన్, ఆగస్టు 25: స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లను 20 నుంచి 42శాతానికి పెంచాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. బీపీ మండల్ జయంతిని పురస్కరించుకొని ఆదివారం జిల్లా కోర్టు ఎదుట ఉన్న మండల్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ గత ఎన్నికల సమయంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతామని మేనిఫెస్టోలో పేర్కొందన్నారు. ఇచ్చిన మాట ప్రకారం రిజర్వేషన్లను పెంచాలని డిమాండ్ చేశారు. అక్టోబరు నెలాఖరులో స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహిస్తామని ప్రభుత్వం ప్రకటిస్తూనే, మరో వైపు కులగణన చేయాలని నిర్ణయం తీసుకుందన్నారు. కులగణన తరువాతే రిజర్వేషన్లు పెంచి స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలన్నారు. కులగణన చేయాలని, రిజర్వేషన్లు 42శాతానికి పెంచాలని బీసీ సంఘాల ఆధ్వర్యంలో మూడు నెలలుగా ఉద్యమాలు చేస్తున్నా, ప్రభుత్వం స్పందించడం లేదన్నారు. రాష్ట్రంలో అన్ని రాజకీయ పార్టీలు బీసీ రిజర్వేషన్లపై మద్దతు తెలుపుతారా? లేదా? అనేదానిపై విధాన ప్రకటన చేయాలని డిమండ్ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు మిర్యాల యాదగిరి, సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, పలు పార్టీలు, సంఘాల నాయకులు నీల వెంకటేశం, పిల్లి రామరాజు, వంగూరి నారాయణయాదవ్, కట్టెబోయిన అనిల్‌కుమార్, రాజారాంయాదవ్, ప్రసన్న, శిరందాసు రామదాసు, సత్తయ్య, సర్వాల వెంకన్న, అల్లి వేణు, మామిడి పద్మ, సింగం లక్ష్మి, కొండూరు సత్యనారాయణ, ఆయితగోని జనార్ధన్‌గౌడ్, గోవర్ధన్, గద్దె నాగరాజు, సతీష్ యాదవ్, వల్లే కీర్తి, మచ్చ గిరి, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా కేంద్ర ఆస్పత్రికి ఏమైంది!

- వరుస సంఘటనలతో అబాసుపాలు
- షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకున్నా విధుల్లో చేరని వైద్యులు, నర్సులు
- అత్యవసర సేవలకు ఆటంకాలు
- తాజా పరిస్థితులపై అదనపు కలెక్టర్‌కు లేఖ రాసిన వైద్యాధికారులు



జిల్లా కేంద్ర ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేసిన పోలీసులు

నల్లగొండ, ఆగస్టు 25: జిల్లా కేంద్ర ఆస్పత్రిలో వరుసగా చోటు చేసుకుంటున్న సంఘటనలతో అబాసుపాలవుతోంది. ఆస్పత్రిలో సీనియర్ వైద్యులు ఉన్నా, తరచుగా మాతా శిశు సంరక్షణ విభాగంలో చోటు చేసుకుంటున్న పరిణామాలతో అధికారులకు సైతం పాలుపోని పరిస్థితి ఏర్పడింది. ఈనెల 23న కుర్చీలోనే నిండు గర్భిణి ప్రసవించిన సంఘటన మరవకముందే 24న బలవంతంగా గర్భిణికి శస్త్రచికిత్స చేయడంతో శిశువు మృతి చెందినట్లు ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది. గతంలో సైతం పలు ఘటనలు జరిగినా, వైద్యులు, సిబ్బంది తీరులో మాత్రం మార్పు రావడం లేదు. కలెక్టర్ సి.నారాయణరెడ్డి పలు మార్లు ఆస్పత్రులను తనిఖీ చేసి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించడంతో పాటు రోజుకో అధికారి జిల్లా కేంద్ర ఆస్పత్రిని తనిఖీ చేసేందుకు ఆదేశాలు ఇచ్చారు.

దీన్ని వైద్యులు వ్యతిరేకించి తమపై నిఘా పెడితే పనిచేయలేమని స్పష్టం చేశారు. అయితే ఆస్పత్రిలో వరుస సంఘటనలు ఇబ్బందికరంగా మారాయి. నల్లగొండ, దేవరకొండ ఆస్పత్రుల్లో జరిగిన ఘటనపై అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర కలెక్టర్‌కు ప్రాథమిక నివేదిక అందజేశారు.

షోకాజ్ వెనక్కు తీసుకున్నా

నిండు గర్భిణి వీల్‌చైర్‌లో ప్రసవించిన విషయంలో డ్యూటీ డాక్టర్‌తో పాటు మరో నలుగురు స్టాఫ్ నర్సులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. డాక్టర్‌తో పాటు నర్సుల నిర్లక్ష్యంగా కారణంగా గర్భిణి కుర్చీలో ప్రసవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని అధికారులు నిర్ధారించడంతో ఐదుగురికి షోకాజ్ ఇచ్చారు. నోటీసులకు సంజాయిషీ ఇవ్వడానికి బదులు విధులకు రాకుండా వారు మాస్ లీవులోకి వెళ్లినట్లు తెలిసింది. అయితే సెలవులు రద్దు చేసుకుని విధుల్లోకి రావాలని సూచించినా వారు రాకపోవడంతో అత్యవసర సేవలకు ఆంటకం కలుగుతోంది. వైద్యులు, నర్సులపై షోకాజ్ నోటీసులు వెనక్కు తీసుకున్నా, వారు ససేమిరా అంటుండటంతో ఆస్పత్రి ఉన్నతాధికారులు అదనపు కలెక్టర్‌కు లేఖ రాసినట్లు తెలిసింది. ఆస్పత్రిలో పరిస్థితులు గాడిలో పెట్టాలని ప్రయత్నించినా, వైద్యులు, నర్సులు ఉన్నతాధికారుల ఆదేశాలను ఖాతరు చేయకపోవడంతో సమస్య జటిలంగా మారుతోంది. శనివారం రాత్రి శిశువు మృతి ఘటనలో కుటుంబ సభ్యులు పోలీస్‌స్టేషన్‌తో పాటు అధికారులకు ఫిర్యాదు చేయడంతో ఆదివారం విచారణ నిర్వహించారు. దీంతో పాటు ఆ శిశువు మృతదేహానికి పోస్టుమార్టం కూడా చేశారు. ఈ నివేదిక వచ్చేందుకు రెండు రోజుల సమయం పట్టే అవకాశం ఉంది. నివేదిక వచ్చాక బాధ్యులపై చర్యలు తీసుకొనే అవకాశాలు ఉన్నాయి.

ఇక దేవరకొండ ఆస్పత్రిలో సైతం ఈనెల 23న నల్లగొండ ఆస్పత్రిలో జరిగిన సంఘటనకు అనుబంధంగా ఉండటంతో ఆ ఆస్పత్రిలో కూడా డాక్టర్‌తో పాటు మరో నలుగురు నర్సులను సస్పెండ్ చేయాలని డీసీహెచ్‌ఎస్‌కు అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఆదేశాలు జారీ చేయగా, ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీనికి తోడు శనివారం దేవరకొండ ఆస్పత్రిలో నలుగురు సూపర్‌వైజర్లు విధులకు గైర్హాజరైన విషయాన్ని తనిఖీ సందర్భంగా అదనపు కలెక్టర్ గుర్తించి వారిని సస్పెండ్ చేయాలని సూచించారు. వరుస సంఘటనలపై జిల్లా కేంద్ర ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమణమూర్తిని 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా అదనపు కలెక్టర్‌కు తాజా పరిస్థితులపై నివేదిక అందజేశామని, శిశువు మృతి చెందిన ఘటనలో రెండు రోజుల్లో పోస్టుమార్టం నివేదిక వస్తుందని, దాని ఆధారంగా ఉన్నతాధికారులు శాఖాపర చర్యలు తీసుకుంటారని స్పష్టం చేశారు.

కూల్చివేతలో నాన్చుడి ధోరణి

చెరువుశిఖం ఆక్రమణకు గురైనట్టు నిర్ధారించినా చర్యల్లో వెనకడుగు



వల్లభరావు చెరువులో అక్రమ నిర్మాణాలు

నల్లగొండ, ఆగస్టు 25: నల్లగొండలోని వల్లభరావు చెరువు(బతుకమ్మకుంట)లో అక్రమ నిర్మాణాలను కూల్చివేతపై నీటిపారుదలశాఖ అధికారులు నాన్చుడి ధోరణి అవలంభిస్తున్నారన్న ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. ఓ వైపు హైదరాబాద్‌లో హైడ్రా దూకుడుగా వ్యవహరిస్తూ చెరువుల్లో అక్రమ నిర్మాణాలను, భారీ భవనాలను కూల్చి వేస్తుండగా, నల్లగొండలో మాత్రం అధికారులు మీనామేషాలు లెక్కిస్తున్నారు. 'కబ్జాకోరల్లో వల్లభరావు చెరువు' శీర్షికన ఈ నెల 22న 'ఆంధ్రజ్యోతి'లో కథనం వెలువడటంతో నీటిపారుదలశాఖ అధికారులు 23న వల్లభరావు చెరువును పరిశీలించారు. వల్లభరావు చెరువులో ఆక్రమణలు వాస్తవమేనని తేల్చారు. నీటిపారుదలశాఖ ఏఈఈ శ్రీశైలంతో పాటు రెవెన్యూ, పోలీస్‌శాఖ అధికారులు చెరువును సందర్శించి ఎఫ్‌టీఎల్‌తో పాటు బఫర్ జోన్‌లో ప్రీకాస్ట్ సరిహద్దు గోడలను అక్రమంగా నిర్మించినట్టు తేల్చారు. గతంలో మాదిరిగానే పోలీస్‌స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్రమణకు గురైనప్పుడు రెండేళ్ల క్రితం 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురించడంతో అక్రమ నిర్మాణాలను కూల్చి హద్దులు ఏర్పాటు చేశారు. తిరిగి కొన్ని నెలలుగా రాజకీయ పార్టీల నాయకులతో పాటు ప్రైవేట్ వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేశారు. నిర్మాణాలకు గేట్లు కూడా ఏర్పాటుచేశారు. మున్ముందు ఈ ఆక్రమిత ప్రాంతంలో భారీ భవన నిర్మాణాలు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు స్థానికంగా చర్చ సాగుతోంది. గతంలో ఆక్రమణలు కూల్చి వేసిన అధికారులు నోటీసులు కూడా ఇచ్చారు. తిరిగి ఆక్రమణలు కొనసాగుతుండటం, అధికారులు పట్టించుకోకపోవడంపై కొందరు తెరవెనుక అండదండలు ఇస్తుడటం వల్లే కూల్చివేతలు చేయకుండా అధికారులు జాప్యం చేస్తున్నట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నీటిపారుదలశాఖ అధికారి శ్రీశైలం మాత్రం దీనిపై స్పందిస్తూ, ఆక్రమణలను గుర్తించామని చర్యలు తీసుకుంటామని చెబుతున్నారు. 86ఎకరాలు ఉన్న చెరువు శిఖం అన్యాక్రాంతమవుతుంటే ఆక్రమణల విషయంలో జాప్యం ఎందుకు చేస్తున్నారని, ఇప్పటికైనా చెరువు హద్దులు, ఫెన్సింగ్ ఏర్పాటుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

క్రీడలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం

భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి



అంతర్జాతీయస్థాయి టెన్నిస్ పోటీలను ప్రారంభిస్తున్న భువనగిరి ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌రెడ్డి

యాదాద్రి, ఆగస్టు 25 (ఆంధ్రజ్యోతి): భువనగిరి కేంద్రంగా అంతర్జాతీయస్థాయి క్రీడలకు అతిథ్యం ఇవ్వడం గర్వకారణమని స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆదివారం భువనగిరిలోని న్యూడైమన్షన్ టెన్నిస్ అకాడమీలో ఐదురోజులపాటు జరిగే రాజా నర్సింహారావు మెమోరియల్ ఇంటర్నేషనల్ టెన్నిస్ ఫెడరేషన్(ఐటీఎఫ్)వరల్డ్ జూనియర్స్ అండర్-18(బాలురు, బాలికలు) పోటీలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ హైదరాబాద్ తరహాలో భువనగిరి కూడా క్రీడారంగంలో అభివృద్ధి చెందుతుందని, అంతర్జాతీయస్థాయి ప్రమాణాలతో ఎనిమిది టెన్నిస్ కోర్టులను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. రాష్ట్రంలోనే ఎక్కడాలేని విధంగా కోర్టులను ఏర్పాటుచేసి, న్యూ డైమెన్షన్ పాఠశాల యాజమాన్యం క్రీడలను ప్రోత్సహిస్తోందని తెలిపారు. రానున్న రోజుల్లో అంతర్జాతీయ, జాతీయ క్రీడాకారుల బస చేసేందుకు భువనగిరిలో సువాలి ఎస్టేట్‌లో త్రీస్టార్ హోటల్ ను నిర్మిస్తున్నారని, హైదరాబాద్ తర్వాత అంతర్జాతీయ క్రీడలకు భువనగిరి వేదిక కానుందన్నారు. దేశ, విదేశాలనుంచి విచ్చేస్తున్న క్రీడాకారులకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ, ఈ పోటీలను విజయవంతంగా చేపట్టిన అసోసియేషన్ బృందాన్ని అభినందించారు. కాగా తెలంగాణ రాష్ట్ర టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతోన్న ఈ పోటీల్లో శని, ఆదివారాల్లో క్వాలీఫై మ్యాచ్‌లు జరుగనుండగా, ఈ నెల 26 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు కొనసాగుతాయి. అమెరికా, కెనడా, ఆస్ట్రేలియా, నేపాల్ తదితర దేశాలతోపాటు దేశంలోని పలు రాష్ట్రాలకు చెందిన 170మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. కార్యక్రమంలో ఏఐటీఏ ఎగ్జిక్యూటివ్ మెంబర్ అశోక్‌కుమార్, న్యూడైమెన్షన్ టెన్నిస్ అకాడమీ డైరెక్టర్ సుభాష్‌రెడ్డి, టీఎస్‌టీఏ అధ్యక్ష, కార్యదర్శులు కేఆర్ రామన్, వి.నారాయణదాస్, సద్ది వెంకట్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.





నిబంధనల్లేకుండా రుణమాఫీ చేయాలి

● తెల్లరేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలి ● ఈ నెల 29న తహసీల్దార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు నిర్వహిస్తాం
● సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి

సూర్యాపేట, ఆగస్టు 25: నిబంధనల్లేకుండా రుణమాఫీ చేయాలని, తెల్లరేషన్ కార్డు నిబంధన ఎత్తివేయాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున రెడ్డి అన్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లాకేంద్రంలోని మల్లు వెంకట నరసింహారెడ్డి భవన్‌లో జరిగిన సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రుణమాఫీకి రాజకీయరంగు పులుముకుందని ఆరోపించారు. రుణమాఫీపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, మాజీ మంత్రి హరీ‌ష్‌రావుకు మధ్య సవాళ్లు, ప్రతి సవాళ్లుగా మారిందన్నారు. రైతులకు ఎవరి రాజీనామాలతో అవసరం లేదన్నారు. ఇచ్చిన హామీమేరకు రుణమాఫీ చేస్తే చాలన్నారు. రూ.2లక్షల కు పైగా ఉన్న రుణాలను ప్రభుత్వమే మాఫీ చేయాలన్నారు. మూడు విడతలుగా కొద్దిమందికే రూ.2లక్షల రుణమాఫీ చేశారని తెలిపారు. రూ.31వేల కోట్ల రుణాల మాఫీకి రాష్ట్ర కేబినెట్ ఆమోదం తెలిపిందని, వాటిలో కేవలం రూ.22వేల కోట్లు మాఫీ అయినట్లు సీఎం అబద్ధపు ప్రకటన చేశారని ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా కేవలం 40శాతం మంది రైతులకే రుణమాఫీ జరిగినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు మేదరమెట్ల వెంకటేశ్వర్‌రావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, కొలిశెట్టి యాదగిరిరావు, మట్టిపల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మీ, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మల్లు నాగార్జునరెడ్డి













ఇక వేగంగా..

● చకచకా నార్కట్‌పల్లి రోడ్డు విస్తరణ పనులు
● వారంలో విద్యుత్ లైన్ మార్చే పనులు షురూ
● మిగిలిన 200 మీటర్ల విస్తరణకూ రూ.6 కోట్లు మంజూరు
● డిసెంబరు నెలాఖరు నాటికి విస్తరణ పూర్తి



నార్కట్‌పల్లి పట్టణంలో మార్చనున్న విద్యుత్ లైన్

నార్కట్‌పల్లి, ఆగస్టు 25: దాదాపు ఆరు నెలలకుపైగా నిలిచిపోయి అస్తవ్యస్తంగా మారిన నార్కట్‌పల్లి పట్టణ రోడ్డు విస్తరణ పనులు తిరిగి ప్రారంభంకానున్నాయి. అసెంబ్లీ ఎన్నికల వరకు కొనసాగి అర్థాంతరంగా నిలిచిన రోడ్డు నిర్మాణ పనులతో ప్రజలు ఇంతకాలం నానా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ఓవైపు రోడ్డు విస్తరణలో భాగంగా చేపట్టిన నూతన డ్రైనేజీ నిర్మాణ పనులు కూడా పూర్తికాకపోవడంతో వర్షాలు కురిసిన సమయంలో నీళ్లు చేరి ఇటు వ్యాపారులు, అటు తాత్కాలిక దుకాణాదారులు తీవ్ర అవస్థలు తీశారు. నల్లగొండ జంక్షన్ వద్ద మలుపు ఎత్తుగా ఉండి ప్రమాదాలకు ఆస్కారం ఏర్పడింది. దీంతో ఈ మలుపు వద్ద వాహన చోదకులు, పాదచారులు నానా పాట్లుపడ్డారు. అర్థాంతరంగా నిలిచిపోయిన రోడ్డు పనులతో ఎదురవుతున్న ఇబ్బందులపై మీడియాలో కథనాలు వచ్చినా పనులను చేయించడంలో అధికారులు విఫలమయ్యారు. రోడ్డు నిర్మాణ పూర్తికి ఈ ఏడాది డిసెంబర్ నెలాఖరు వరకు గడువు ఉండటం, ఇప్పటివరకు చేసిన పనులకూ బిల్లులు చెల్లించకపోవడం విద్యుత్ లైన్ మార్చే పనులు చేయాల్సింది రోడ్డు నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టరా? లేక విద్యుత్ సంస్థతో చేయించాలా? అనే విషయంలో స్పష్టత కొరవడిన వంటి కారణాలతో ఇన్ని నెలలు పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. విద్యుత్ లైన్ మార్చితే కాని డ్రైనేజీ నిర్మాణ పనులు చేయలేని పరిస్థితి నెలకొంది. ఐతే పట్టణంలో రోడ్డు కిరువైపులా ఉన్న విద్యుత్ స్థంభాల లైన్‌ను మార్చే పనులను చేసేందుకు సదరు కాంట్రాక్టర్‌కే ప్రభుత్వం ఎట్టకేలకు అనుమతి ఇచ్చినట్లు తెలిసింది. దీంతో ఈ వారంలో తొలుత విద్యుత్ లైన్ నిర్ణీత ప్రదేశానికి మార్చే పనులను చేపట్టి తదుపరి డ్రైనేజీ నిర్మాణం, డివైడర్ పనులు పూర్తి చేస్తారని తెలిసింది.

రూ.6 కోట్లు మంజూరు

రోడ్డు విస్తరణ పనుల్లో మిగిలిన 200మీటర్ల రోడ్డు విస్తరణకూ మోక్షం లభించింది. సుమారు రూ.6కోట్లను ప్రభుత్వం మంజూరు చేసింది. నార్కట్‌పల్లి పట్టణంలోని పాత జాతీయ రహదారి విస్తరణకోసం గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.16కోట్లు మంజూరుచేసింది. అయితే లారీ అసోసియేషన్ కార్యాలయం నుంచి మొదలై కామినేని జంక్షన్ వరకు ఉన్న పట్టణ రహదారిని విస్తరించాల్సి ఉండగా మంజూరైన నిధులు సరిపోలేదు. దీంతో సన్‌షైన్ కాలనీ నుంచి కామినేని జంక్షన్ వరకు ఇంకా200 మీటర్ల రోడ్డు విస్తరణ చేపట్టాల్సి ఉంది. ఈ సమస్యను అధికారులు స్థానిక ఎమ్మెల్యే వేముల వీరేశం దృష్టికి తీసుకువెళ్లగా రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి చొరవతో రూ.6 కోట్ల నిధులను ఎమ్మెల్యే మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ కూడా పూర్తికాగా ప్రస్తుతం పనులు చేస్తున్న కాంట్రాక్టర్‌కు బదులు నకిరేకల్‌కు చెందిన మరో కాంట్రాక్టర్ పనులు దక్కించుకున్నారని త్వరలోనే ఇక్కడ కూడా విస్తరణ పనులు ప్రారంభం కానున్నాయి.

ఎడిట్ ఆప్షన్ వచ్చేసింది

● గృహజ్యోతి జీరోబిల్లు వర్తించని దరఖాస్తుదారులకు మరో అవకాశం
● జిల్లాలో వేలాది కుటుంబాలకు ప్రయోజనం
● సద్వినియోగం చేసుకోవాలంటున్న అధికారులు



కనగల్‌లో జీరోబిల్లు కోసం దరఖాస్తు ఇస్తున్న మహిళ

కనగల్, ఆగస్టు 25: కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ఆరు గ్యారెంటీల్లో భాగంగా 'గృహజ్యోతి' జీరో కరెంటు బిల్లు పథకానికి దరఖాస్తు చేసుకున్నప్పటికీ పథకం వర్తించని దరఖాస్తుదారులకు ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. గత జనవరిలో ఆరుగ్యారెంటీల అమలులో భాగంగా ప్రజాపాలన సభలను గ్రామాల్లో నిర్వహించి గృహజ్యోతి పథకంకింద 200 యూనిట్ల వరకు గృహాలకు ఉచిత విద్యుత్‌ను అందించేందుకు ప్రజలనుంచి దరఖాస్తులను ప్రభుత్వ ఆదేశాలమేరకు అధికారులు స్వీకరించారు. అయితే కంప్యూటరీకరణ డాటా ఎంట్రీలో జరిగిన పొరపాట్ల కారణంగా అర్హత కల్గిన వేలాది కుటుంబాలకు పథకం వర్తించక ఎనిమిది నెలలుగా యథావిధిగా వస్తున్న గృహ విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. ఈక్రమంలో వెబ్‌సైట్‌లో నాట్ అప్లై అంటూ చూపుతున్న దరఖాస్తుదారులకు ఎడిట్ ఆప్షన్ కల్పించి పథకం వర్తింపజేయాలని మొరపెట్టుకుంటూ వస్తున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వం మంగళవారం సాయంత్రంనుంచి వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్‌ను తీసుకొచ్చింది. దీంతో పలువురు దరఖాస్తుదారులు తమ ప్రజాపాలన దరఖాస్తులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయాలకు తీసుకెళ్లి విద్యుత్‌మీటర్ నెంబర్లను నమోదు చేయించుకుంటున్నారు. జిల్లావ్యాప్తంగా కంప్యూటరీకరణ సమయంలో జరిగిన పొరపాట్ల కారణంగా 10వేల నుంచి 15వేల మంది కుటుంబాలకు పథకం వర్తించలేదు. కాగా ఎడిట్ ఆప్షన్ అందుబాటులోకి రావటంతో వీరందరికీ జీరోబిల్లు వర్తించే అవకాశం ఉంది. కనగల్ మండలంలో 1500 కుటుంబాలకు ప్రయోజనం పొందనున్నారు. వీరంతా ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

'గృహజ్యోతి' వెబ్‌సైట్‌లో ఎడిట్ ఆప్షన్‌ను ప్రభుత్వం మంగళవారం సాయంత్రంనుంచి అందుబాటులో ఉంచింది. ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్నప్పటికీ పథకం వర్తించని నాట్ అప్లయ్‌గా చూపుతున్న దరఖాస్తుదారులు మరోసారి తమ కరెంట్‌బిల్లు, ఆధార్, మీటర్‌బిల్లు, ప్రజాపాలన రశీదును వెంటతీసుకుని ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి నమోదుచేయించుకోవాలి. ప్రభుత్వం అమలు చేస్తున్న గృహజ్యోతి ఉచిత విద్యుత్‌ను పొందాలి. ఎడిట్ ఆప్షన్‌ను అర్హులైన కుటుంబాలు సద్వినియోగం చేసుకోవాలి.

తులసి జయరాం, కనగల్, ఎంపీడీవో

కుక్కలున్నాయి జాగ్రత్త!



జడ్చర్ల-కోదాడ జాతీయ రహదారిపై కుక్కల గుంపు

- ఒక్కసారిగా దాడులు చేస్తున్న శునకాలు
- రహదారులపై వెళుతుండగా వాహనాలకు అడ్డుగా
- భయం గుప్పిట్లో ప్రజలు.. పట్టించుకోని అధికారులు

కొండమల్లేపల్లి, ఆగస్టు 25: కొండమల్లేపల్లిలో వీధి కుక్కల బెడద రోజురోజుకూ పెరిగిపోతోంది. ఏ వీధిలో చూసినా కుక్కలు గుంపులు.. గుంపులుగా సంచరిస్తూ స్థానికులను బెంబేలెత్తిస్తున్నాయి. రహదారులపై వాహనదారులు, ప్రయాణికులను వెంబడిస్తున్నాయి. 167వ జాతీయ రహదారిపై కుక్కలు గుంపులుగా తిరుగుతుండడంతో వాహనదారులు రోడ్డుపై వెళ్లాలంటేనే భయపడాల్సి వస్తుందని వాహనదారులు వాపోతున్నారు. ఇటీవల పీఏపల్లి మండలం బాలాజీనగర్‌కు చెందిన మెగావత్ థావు తన ఆటోలో కిరాణ షాపు సరుకులకోసం కొండమల్లేపల్లికి వస్తుండగా, చౌరస్తాలో కుక్కల గుంపును ఢీకొనడంతో ఆటో డివైడర్‌కు తగిలి, థావు తలకు తీవ్ర గాయాలై మృతి చెందాడు. అదే విధంగా పాఠశాలలకు వెళ్లే విద్యార్థుల వెంట కుక్కలు పడుతుండడంతో బడికి వెళ్లాలంటేనే జంకుతున్నారు. రాత్రివేళల్లో వాటి అరుపులతో కాలనీ వాసులకు నిద్ర లేకుండా పోతోంది. రాత్రివేళల్లో వాహనాల వెంటపడుతూ ప్రమాదాలకు గురి చేస్తున్నాయి. శునకాల సంతతిని నియంత్రించాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసినప్పటికీ అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్లు వ్యవహరిస్తున్నారు. ప్రమాదం జరిగినప్పుడే పట్టించుకుంటారా? లేకపోతే సమస్యను పరిష్కరించరా? అని స్థానికులు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. గ్రామపంచయతీ సిబ్బందికి ఎన్నిసార్లు ఫిర్యాదుచేసినా పట్టించుకోవడం లేదని గ్రామస్థులు ఆరోపిస్తున్నారు.

కుక్కలతో ఇబ్బంది పడుతున్నాం



కొండమల్లేపల్లి మండలకేంద్రంలో కుక్కలతో చాలా ఇబ్బందులు పడుతున్నాం. చిన్న పిల్లలను ఒంటరిగా పంపించాలన్నా, రాత్రివేళల్లో బయటకు వెళ్లాంటే ఎక్కడ దాడి చేస్తాయోనని భయపడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి కుక్కల నివారణకు శాశ్వత సమస్యలు పరిష్కరించాలి.

- బోడ కృష్ణ, కొండమల్లేపల్లి

భయపెడుతున్న కుక్కలు

చింతపల్లి: నల్లగొండ జిల్లా చింతపల్లి మండల కేంద్రంతో పాటు వేంకటేశ్వరనగర్, గొల్లపల్లి, గొడుకొండ్ల గ్రామాల్లో రోడ్లవెంట నడవాలంటే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. ఇటీవల కాలంలో పట్టణంలో ని పలు వీధులతోపాటు మండలంలో గ్రామసింహాలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రధానంగా గొడుకొండ్ల, వేంకటేశ్వరనగర్, చింతపల్లి, పోలేపల్లిరాంనగర్, కిషన్‌పల్లి, కుర్మేడ్, వింజమూర్, అంగడికుర్మపల్లి, ఎం.మల్లేపల్లి, కిష్టరాయినిపల్లి, తక్కళ్లపల్లి, తదితర గ్రామాల్లో గత నెల రోజులుగా కుక్కలు గుంపులుగా తిరుగు తూ చిన్నారులు, వృద్ధులపై దాడులు చేస్తున్నాయి. అధికారులు స్పందించి కుక్కల నియంత్రణకు తగిన చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. కిషన్‌పల్లి గ్రామానికి చెందిన గణేష్, స్వాతి వారి పాపతో కలిసి ద్విచక్రవాహనంపై వెంకటేశ్వరనగర్‌కు వచ్చా రు. తిరుగు వెళ్తుండగా కుక్కలు దాడి చేశాయి. వెంకటేశ్వరనగర్(మాల్) పట్టణానికి చెందిన వైద్యుల శ్రీనాథ్ కూరగాయాలు కొనుగోలు కోసం వెళ్లారు. వస్తుండగా కాలనీలో పదుల సంఖ్యలో కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి.

ఇళ్లలో.. వానరాలు.. వీధుల్లో శునకాలు



ఆత్మకూరు(ఎం): ఇళ్లల్లో కోతుల (వానరాలు)బాధ, బయటకొస్తే వీధికుక్కల(శునకాలు) దడతో ప్రజలు భయపడుతున్నారు. మండలంలోని ఏ గ్రామంలో చూసినా శునకాలు హడలెత్తిస్తుండగా, కోతుల బాధతో ప్రజలు విసుగు చెందుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు ఇంటినుంచి బయటకు వెళ్లాలంటే జంకుతున్నారు. వీధుల్లో గుంపులు గుంపులుగా తిరుగుతున్న కోతులు, కుక్కలను చూసి చిన్న పిల్లలను పాఠశాలకు ఒంటరిగా పంపించలేక తల్లిదండ్రులు భయపడుతున్నారు. ఇండ్లలో కూర్చున్న వృద్ధులపై, ఇంటి ముందు ఆడుకుంటున్న పిల్లలపై కుక్కలు దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. రాత్రిపూట గొర్రెలు, మేకల మందలపై కుక్కలు దాడి చేసి మూగజీవాలను చంపేస్తున్నాయని గొర్రెకాపర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పల్లెర్ల గ్రామానికి చెందిన తాడూరి సాయిలు పై వీధి కుక్కలు దాడిచేసి అతని కుడి చెయ్యి బొటన వేలు కొరికివేయగా అతని కుటుంబ సభ్యులు హైదరాబాద్‌కు తరలించి చికిత్స చేయించారు. అదేగ్రామానికి చెందిన గర్షకోట పుష్ప ఇంట్లోకి వెళుతుండగా గుంపుగా వచ్చిన కోతులు ఆమెపై దాడిచేసి గాయపర్చాయి. పుష్పను హైదరాబాద్ నల్లకుంటకు తరలించి చికిత్స చేయించారు. కొరటికల్ గ్రామంలో తుమ్మల నర్మద, పెద్దిరెడ్డి నారాయణరెడ్డి, నాగుల దేవయ్య, సున్నోజు పాండ రి, జయమ్మల పై కోతులు దాడి చేసి గాయపర్చగా ఆత్మకూరు పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించుకుని మెరుగైన వైద్యంకోసం హైదరాబాద్ వెళ్లారు. స్థానిక పీహెచ్‌సీలో సుమారు 45మంది కుక్కకాటు, 15మంది కోతులు గాయపర్చినందుకు టీకాలు వేయించుకున్నారు. కోతులు ఇళ్లలో చొరబడి బియ్యం, పప్పులు, కూరగాయలతో పాటు తినుబండారాలు పట్టుకుపోవడంతో పాటు సామగ్రిని కింద పడేస్తూ నానా బీభత్సం సృష్టిస్తున్నాయి.

ఐదుగురిపై పిచ్చికుక్క దాడి..



దేవరకొండ: నల్లగొండ జిల్లా నేరేడుగొమ్ము మండలం పలుగుతండాలో ఈ నెల 21న పిచ్చికుక్క దాడిచేయగా, ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. మండలంలోని పలుగుతండాలో నివసిస్తున్న వడ్త్య సుక్కునాయక్ తలపై దాడి చేసిన పిచ్చికుక్క ఆయన ఇంటి ముందు ఆడుకుంటున్న నేనావత్ అక్షిత అనే మూడో తరగతి విద్యార్థిని గాయపరిచింది. మరికొద్ది సేపటికి తండాకు చెందిన నేనావత్ కార్తీక్, నేనావత్ కుమార్, నేనావత్ శ్రీలతలపై దాడిచేసి తీవ్రంగా గాయపరిచింది. అప్పటికే అప్రమత్తమైన తండావాసులు కుక్కను పట్టుకునే క్రమంలో పారిపోయింది. కుక్కదాడిలో తీవ్రగాయాలైన బాధితులను హుటాహుటిన ఆటోలో తండావాసులు, బాధితుల కుటుంబసభ్యులు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాధితులకు దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ కుక్కకాటు ఇంజక్షన్‌తో పాటు వైద్యచికిత్స అందించారు.

తంగడపల్లిలో కుక్కల బెడద

భయాందోళనలో ప్రజలు



చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లిలో కుక్కల స్వైర విహారం

చౌటుప్పల్ టౌన్, ఆగస్టు 25: చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లిలో గల 4,5, 6, 15 వ నంబరు వార్డుల్లో కుక్కల స్వైర విహారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చౌటుప్పల్ నుంచి మునుగోడు కు వెళ్లే ప్రధాన రోడ్డుపై గుంపులు, గుంపులుగా తిరుగుతూ వాహనదారులు, పాదచారులను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయి. కుక్కల గుంపులతో ద్విచక్రవాహనదారులు తరచూ ప్రమాదాలకు గురవుతున్నారు. రోడ్డు వెంట వెళుతున్న వాహనదారులను కుక్కలు వెంబడిస్తుండడంతో ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. విద్యార్థులు పాఠశాలలకు వెళ్లాలంటేనే జంకుతున్నారు. పిల్లలతో పాటు పెద్దలు సైతం వీధుల్లోకి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. నాలుగు వార్డుల్లో దాదాపుగా 135 నుంచి 150 కుక్కలు ఉండవచ్చునని అంచనా. కాగా తంగడపల్లిలో నెలకొన్న కుక్కల బెడదను నివారించాలని శుక్రవారం ట్విట్టర్‌లో రాష్ట్ర పురపాలక, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, తెలంగాణ సీఎంవో, కలెక్టర్, చౌటుప్పల్ మునిసిపల్ కమిషనర్‌కు పారా లీగల్ వలంటీర్ ముటుకుల్లోజు రాఘవ పోస్ట్ చేశారు. కుక్కల బెడద నుంచి వాహనదారులు, ప్రజలను రక్షించాలని ఆయన కోరారు.

వారం రోజుల్లో కుక్కల బెడదను నివారిస్తాం

చౌటుప్పల్ మునిసిపాలిటీలోని తంగడపల్లిలో నెలకొన్న కుక్కల బెడదను వారం రోజుల్లో నివారిస్తాం. మునిసిపాలిటీలోని కుక్కలను పట్టుకొని వెళ్లే టెండర్ ను స్వతంత్ర ఏజెన్సీ తీసుకుంది. ఇప్పటికే కొన్ని వా ర్డులలో కుక్కలను ఆ ఏజెన్సీ బృందం పట్టుకొని వెళ్లింది. కుక్కల బారీ నుంచి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూసేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నాం.

- ఎన్.వెంకటేశ్వరనాయక్, కమిషనర్, చౌటుప్పల్ మునిసిపాలిటీ

భక్తజనసంద్రం యాదగిరిక్షేత్రం

● స్వామివారి నిత్య ఆదాయం రూ.48,47,250





కొండపై భక్తుల రద్దీ, యాదగిరీశుడి సన్నిధిలో హోమం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట రూరల్, ఆగస్టు 25: యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహస్వామివారి దర్శనార్థం ఆదివారం వచ్చిన భక్తులతో యాదగిరి కొండ భక్తజన సంద్రమైంది. వారాంతపు సెలవు రోజు కావడంతో ఇష్టదైవాలను దర్శించుకునేందుకు భక్తులు అధికసంఖ్యలో వాహనాల్లో తరలివచ్చారు. సుమారు 26వేల మంది భక్తులు క్షేత్ర దర్శనానికి రాగా, ప్రత్యేక, ధర్మదర్శన క్యూలైన్లు భక్తులతో రద్దీగా కన్పించాయి. ప్రధానాలయం, కల్యాణోత్సవం, వ్రత మండపాలు, ఆలయ తిరువీధులు, ప్రసాద విక్రయశాలల వద్ద భక్తుల రద్దీ కొనసాగింది. ధర్మ దర్శనానికి రెండు గంటలు, ప్రత్యేక దర్శనానికి గంట సమయం పట్టిందని భక్తులు తెలిపారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల ద్వారా రూ.48,47,250 ఆదాయం సమకూరినట్టు ఆలయ అధికారులు తెలిపారు. సుప్రభాత సేవతో స్వామి అమ్మవారిని మేల్కొపిన అర్చకులు స్వయంభువులకు నిత్య పూజలు, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో నిర్వహించారు. కొండపైన శివాలయంలో పర్వతవర్ధిని సమేత రామలింగేశ్వర స్వామివారికి నిత్య పూజలు, రుద్ర హవన పూజలు శైవాగమరీతిలో కొనసాగాయి.

జిట్టాకు పలువురి పరామర్శ



జిట్టా బాలకృష్ణారెడ్డిని పరామర్శిస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు

భువనగిరి రూరల్, భువనగిరి టౌన్, ఆగస్టు 25: తెలంగాణ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు జిట్టా బాలకృష్ణారెడ్డి అనారోగ్యంతో బాధపడుతూ హైదరాబాద్ సికింద్రాబాద్ యశోద ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఆయనను మాజీమంత్రి టి. హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఆదివారం ఆస్పత్రిలో పరామర్శించారు. కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పారు. అదేవిధంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు గూడూరు నారాయణరెడ్డి జిట్టాను పరామర్శించారు.

చికిత్సపొందుతూ రైతు మృతి

వలిగొండ, ఆగస్టు 25: ఆర్థిక ఇబ్బందులతో మనస్తాపం చెంది పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన రైతు చికిత్సపొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఎస్ఐ మహేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. యాదాద్రిభువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన రైతు అంబోజు నర్సింహ(54) కుటుంబ అవసరాలు, కుమార్తె వివాహానికి సుమారు రూ. 7లక్షల వరకు అప్పుల చేసినట్లు సమాచారం. ఆర్థికంగా కుంగిపోవడంతో నిరాశకు గురై వలిగొండ మండలం లోతుకుంట గ్రామ పరిసర ప్రాంతాల్లో శనివారం పురుగుల మందు తాగి కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చాడు. కుమారుడు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని తండ్రిని భువనగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. చికిత్సపొందుతూ ఆదివారం మృతిచెందాడు. కుమారుడు వెంకన్న ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. పోస్టుమార్టం తర్వాత మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

జనావాసాల్లోకి జాతీయ పక్షి



భువనగిరి టౌన్, ఆగస్టు 25: యాదాద్రి భువనగిరి జిల్లాకేంద్రంలోని సంతోష్‌నగర్‌లో జనావాసాల్లోకి జాతీయ పక్షి నెమలి కంపచెట్లలో ఇరుక్కుపోయింది. గమనించిన పాండురంగం 100కు డయల్ చేసి సమాచారం ఇచ్చాడు. వెంటనే స్పందిం చిన పోలీసులు అటవీ శాఖకు సమాచారం ఇచ్చారు. పోలీసులు, అటవీ శాఖ సిబ్బంది ఉదయ్‌కుమార్, రమేష్, విశ్వరూపాచారి, అనిల్‌కుమార్, శ్రీనివాస్, నర్సయ్య, సన్ని ముళ్ల పొదలనుంచి నెమలిని తీసి ప్రాథమిక చికిత్స అందించారు.

సాగర్ క్రస్ట్‌గేట్ల ఎత్తివేత, మూసివేత

- ఉదయం రెండు గేట్ల ద్వారా నీటి విడుదల
- మధ్యాహ్నం మూసివేత
- సాగర్‌లో పూర్తిస్థాయి నీటిమట్టం



సాగర్ రెండు క్రస్ట్ గేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

నాగార్జునసాగర్, కేతేపల్లి, మేళ్లచెర్వు, ఆగస్టు 25: నాగార్జునసాగర్ ప్రాజెక్టు క్రస్ట్ గేట్లను ఆదివారం ఏడు గంటలపాటు ఎత్తి ఆ తరువాత మూసివేశారు. ఆదివారం ఉదయం 6 గంటలకు రెండు క్రస్ట్ గేట్లను ఐదు అడుగుల మేరకు ఎత్తి 16,200 క్యూసెక్కుల నీటిని ప్రాజెక్టు అధికారులు దిగువకు విడుదల చేశారు. మధ్యాహ్నం 1 గంటకు తిరిగి క్రస్ట్ గేట్లను మూసివేశారు. ఎగువ నుంచి వరద రాక కొనసాగుతుండటంతో సాగర్ నీటిమట్టాన్ని పూర్తిస్థాయిలో (590అడుగులు) ఉంచుతూ కాల్వలకు, జలవిద్యుత్ కేంద్రానికి నీటి విడుదల చేస్తున్నారు. ఆదివారం సాయంత్రానికి ప్రాజెక్టు నీటిమట్టం 590 అడుగులుగా ఉంది. సాగర్‌కు ఎగువన ఉన్న శ్రీశైలం ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు (215.8070 టీఎంసీలు) కాగా, శ్రీశైలానికి ఎగువ నుంచి 45,855 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది. దీంతో శ్రీశైలం నీటిమట్టం 884.10 అడుగులుగా (210.5130టీఎంసీలుగా)ఉంది. శ్రీశైలం ప్రాజెక్టు ఎడమగట్టు జలవిద్యుత్ కేంద్రంలో విద్యుత్‌ను ఉత్పత్తి చేస్తూ 37,882 క్యూసెక్కుల నీటిని సాగర్‌కు వదులుతున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు (312.0450టీఎంసీలు) కాగా, ప్రస్తుతం 590 అడుగులుగా ఉంది. సాగర్ నుంచి కుడికాల్వ ద్వారా 8,981 క్యూసెక్కుల నీటిని, ఎడమకాల్వ ద్వారా 8,367 క్యూసెక్కులు, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,070 క్యూసెక్కులు, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 క్యూసెక్కులు, వరదకాల్వ ద్వారా 600 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 48,818 క్యూసెక్కుల నీరు విడుదలవుతుండగా, ఎగువ నుంచి 37,882 క్యూసెక్కుల నీరు సాగర్‌కు వచ్చి చేరుతోంది.

మూసీ రెండు గేట్ల నుంచి నీటి విడుదల


మూసీ ప్రాజెక్టు రెండు గేట్ల ద్వారా నీటి విడుదల కొనసాగుతోంది. ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో పెరగడంతో బుధవారం నుంచి ప్రాజెక్టు 2, 7, 8 నెంబరు క్రస్ట్ గేట్లను అడుగు మేర ఎత్తి వరద నీటిని దిగువకు విడుదల చేస్తున్న అధికారులు ఎగువ నుంచి వచ్చే ఇన్‌ఫ్లో తగ్గుముఖం పట్టడంతో రెండు రోజుల క్రితం ఒక గేటును పూర్తిగా మూసేశారు. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లోకు అనుగుణంగా ప్రాజెక్టు 2, 7 నెంబర్ క్రస్ట్ గేట్లను అడుగు మేర ఎత్తి 1,290.26 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదలచేస్తున్నారు. ఎగువ నుంచి 1087.14 క్యూసెక్కుల వరద నీరు వచ్చి ప్రాజెక్టులో చేరుతోంది. 645 అడుగుల (4.46టీఎంసీలు) పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం ఉన్న మూసీ ప్రాజెక్టు ప్రస్తుత నీటిమట్టం 643.40 అడుగులు (4.04టీఎంసీ)గా ఉంది. మరోవైపు మూసీ ఆయకట్టులో వానాకాలం పంటల సాగు కోసం ప్రాజెక్టు కుడికాల్వకు 119.70 క్యూసెక్కులు, ఎడమ కాల్వకు 215.46 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. మూసీ నుంచి మొత్తంగా 1,685.64 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది.

పులిచింతల ప్రాజెక్టులో పూర్తిస్థాయి నీటి నిల్వ

ఉభయ తెలుగు రాష్ట్రాల సరిహద్దులోని పులిచింతల ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటితో నిండకుండలా ఉంది. ఎగువ నుంచి వచ్చిన వరదను వచ్చినట్టే అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 175 అడుగులు (45.77 టీఎంసీలు)కాగా, ఆదివారం సాయంత్రానికి 174.93 అడుగులు (45.67 టీఎంసీలుగా)గా ఉంది.ప్రాజెక్టుకు ఇన్‌ఫ్లో 31,929 క్యూసెక్కులుగా నమోదైంది. తెలంగాణ జల విద్యుత్ కేంద్రం నుంచి 16వేల క్యూసెక్కుల నీటిని వినియోగిస్తూ నాలుగు యూనిట్ల ద్వారా 105 మెగావాట్ల విద్యుత్‌ను ఉత్పత్తిని చేస్తున్నారు. రెండు రేడియల్ క్రస్ట్ గేట్లను 1.5మీటర్లు ఎత్తి 28,586 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు మొత్తంగా అవుట్‌ఫ్లో 44,586 క్యూసెక్కులుగా నమోదైంది.

అక్రమాలకు పాల్పడితే ఇక అంతే

- ఇప్పటికే పలువురు ఉద్యోగులపై వేటు
- ఆరుగురు కానిస్టేబుళ్లతో పాటు 15మంది సస్పెండ్, 42 మందికి షోకాజులు జారీ
- హడలెత్తిస్తున్న సూర్యాపేట కలెక్టర్, ఎస్పీ
- జాబితాలో మరికొందరు అధికారులు, ఉద్యోగులు



సూర్యాపేట(కలెక్టరేట్), ఆగస్టు 25: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులు జర జాగ్రత్తగా ఉండాల్సిందే. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా చర్యలు తీసుకుంటున్నారు. జిల్లాలో విధుల్లో నిర్లక్ష్యంగా ఉన్న కొంతమంది అధికారులు, ఉద్యోగులపై ఇప్పటికే వేటు పడింది. ఇంకా ఆ జాబితాలో మరికొందరు ఉన్నట్లు సమాచారం. గతంలో ఏవిధంగా ఉద్యోగం చేసినా చెల్లుబాటైంది. ఇప్పటివరకు ఓలెక్క. ఇక నుంచి మరో లెక్క చందంగా పరిస్థితి మారింది. విధుల్లో ఉద్యోగులు నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అక్రమాలకు పాల్పడినా నూతన కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ ఏమాత్రం ఉపేక్షించడంలేదు. ప్రతిరోజు జిల్లాలో ఏదో ఒక గ్రామం, మండలానికి ఆకస్మికంగా వెళ్లి ప్రభుత్వ కార్యాలయాల్లో అధికారులు, ఉద్యోగుల పనితీరును పరిశీలిస్తున్నారు. దీంతో ఇప్పటికే ఉపాధ్యాయులు, ఉద్యోగుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. అంకితభావంతో విధులు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు ఎటువంటి ఇబ్బందులు రావడంలేదు. జిల్లాలో వివిధ శాఖలతో పాటు పోలీస్ శాఖలో కూడా అవినీతి, అక్రమాలకు పాల్పడటంతో పాటు విధుల్లో నిర్లక్ష్యంగా కొందరు అధికారులు, ఉద్యోగులు వ్యవహరిస్తున్నట్లు సమాచారం. వారిపై కూడా ప్రత్యేకంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం.

ఇప్పటికే పలువురు ఉద్యోగులపై వేటు

జిల్లాలో విధుల పట్ల నిర్లక్ష్యం వహించినా, అక్రమాలకు పాల్పడినా వేటు వేస్తున్నారు. అక్రమాల విషయం కలెక్టర్ దృష్టికి వచ్చిదంటే వెంటనే విచారణ చేయించి వాస్తవమని తేలితే వెంటనే సస్పెండ్ చేస్తున్నారు. కలెక్టర్‌గా తేజస్ నందలాల్ పవార్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి ఇప్పటికే పలువురు అధికారులు, ఉద్యోగులను సస్పెండ్ చేశారు. మరికొంత మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు. ఆత్మకూర్(ఎస్) ఎంఈవో విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆయనను సస్పెండ్ చేశారు. అంతేకాక ఆరుగురు ఉపాధ్యాయులను కూడా సస్పెండ్ చేశారు. వీరితో పాటు అవినీతి అక్రమాలకు పాల్పడుతున్నారనే కారణాలతో రెవెన్యూ శాఖలో ముగ్గురు, వైద్య ఆరోగ్యశాఖలో నలుగురు, పంచాయతీ కార్యదర్శులు ఇద్దరిని సస్పెండ్ చేశారు. అదే విధంగా ఒక తహసీల్దార్‌ను బదిలీ చేయడంతో పాటు వివిధ శాఖలకు చెందిన 42 మందికి షోకాజ్ నోటీసులు జారీ చేశారు.

పోలీస్ శాఖలో..

పోలీస్ శాఖలో అవినీతికి పాల్పడాలంటే వెన్నులో వణుకుపుడుతోంది. విధులతో నిర్లక్ష్యంగా వ్యవహరించినా, అవినీతి, అక్రమాలకు పాల్పడినా వెంటనే వేటు వేస్తున్నారు. ఎస్పీగా జిల్లా సన్‌ప్రీత్‌సింగ్ బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి నేటి వరకు ఏడుగురు పోలీస్ సిబ్బందిని సస్పెండ్ చేశారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన మేళ్లచెర్వు, గరిడేపల్లి పోలీస్‌స్టేషన్ల పరిధిలో ముగ్గురు కానిస్టేబుళ్లు, సూర్యాపేట పట్టణంలో ఇసుక అక్రమ రవాణాకు సహకరిస్తూ డబ్బులు తీసుకుంటున్నారనే ఫిర్యాదుతో ముగ్గురు కానిస్టేబుళ్లు, ఓ దుకాణం ఎదుట పార్క్ చేసిన పోలీస్ శాఖకు చెందిన ఓ బైక్ చోరీకి గురికాగా, నిర్లక్ష్యం వల్లే ఈ చోరీ జరిగిందని ఓ ఏఆర్ కానిస్టేబుల్‌ను సస్పెండ్ చేశారు. అయినప్పటికీ జిల్లాలోని పలువురు పోలీసుల్లో ఇంకా మార్పు రావడంలేదనే ఆరోపణలు ఉన్నాయి. అధికారులు, ఉద్యోగులు సక్రమంగా విధుల నిర్వహిస్తేనే ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండే అవకాశాలు ఉన్నాయి.

రోడ్డు ప్రమాదంలో వృద్ధుడి మృతి

మునగాల, ఆగస్టు 25: సూర్యాపేట జిల్లా మునగాల మండలంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి చెందాడు. మునగాల ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన గుంజ ఎల్లయ్య(60), టీవీఎస్ మోపెడ్‌పై తన వ్యవసాయ పొలానికి వెళ్లి వస్తుండగా, సాగర్ ఎడమ కాల్వ వద్ద జాతీయ రహదారిపై విజయవాడ నుంచి హైదరాబాద్ వెళ్లే డీసీఎం వాహనాన్ని డ్రైవర్ అజాగ్రత్తగా, అతివేగంగా మోపెడ్‌ను నడుపుతున్న ఎల్లయ్య మోపెడ్‌ను వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో ఎల్లయ్య అక్కడికక్కడే మృతి చెందాడు. ఎల్లయ్య మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కోదాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడి కుమార్తె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డీసీఎంను ఢీకొట్టిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు

● బస్సు క్లీనర్ మృతి ● ప్రయాణికులకు స్వల్పగాయాలు



ప్రమాదంలో నుజ్జునుజ్జయిన ప్రైవేట్ ట్రావెల్ బస్సు,

వేములపల్లి, ఆగస్టు 25: డీసీఎం వ్యాన్‌ను వెనుక నుంచి ప్రైవేట్ ట్రావెల్ బస్సు ఢీకొట్టడంతో బస్సులోని క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ప్రమాదం ఆదివారం తెల్లవారుజామున వేములపల్లి మండలంలోని శెట్టిపాలెం గ్రామ శివారులో గల నార్కట్‌పల్లి - అద్దంకి రహదారిపై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మార్నింగ్ స్టార్ ప్రైవేట్ ట్రావెలింగ్ బస్సు రాత్రి 8 గంటలకు ఆంధ్రప్రదేశ్‌లోని బాపట్ల నుంచి 27 మంది ప్రయాణికులు, డ్రైవర్ కేసాని మురళీకృష్ణ, క్లీనర్ దావాల దావీద్ (40)లతో బస్సు హైదరాబాద్‌కు బయలుదేరింది. రాత్రి సుమారు 2 గంటల ప్రాంతంలో మండలంలోని శెట్టిపాలెం గ్రామశివారులోని మహర్షి మిల్లు సమీపంలో రోడ్డు పక్కన నిలిచి ఉన్న డీసీఎం వ్యాన్‌ను అతివేగంగా వచ్చి వెనుక నుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో డీసీఎం, బస్సు మధ్యలో ఇరుక్కున్న బస్సు క్లీనర్ దావీద్‌కు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందగా ప్రయాణికులకు స్వల్ప గాయాలైనట్లు తెలిపారు. అనంతరం ప్రయాణికులను వేరొక బస్సులో తమ గమ్యస్థానాలకు పంపించారు. అనంతరం మృతదేహానికి పంచనామా నిర్వహించిన పోలీసులు మిర్యాలగూడ ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతుడి భార్య సుశీల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఏఎస్ఐ నరసింహారావు పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. మృతుడు దావీద్ చిలకలూరిపేట వైఎస్ఆర్ కాలనీలో నివాసం ఉంటుండగా ఆయనకు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు.

● ప్రైవేట్ ట్రావెల్ బస్సు బోల్తా



రోడ్డుపై పడిపోయిన ఎస్ఎల్‌వీఆర్ ప్రైవేట్ ట్రావెల్ బస్సు

ప్రైవేట్ ట్రావెల్ బస్సు అదుపు తప్పి బోల్తాపడిన సంఘటన ఆదివారం తెల్లవారుజామున మండల కేంద్రంలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎస్ఎల్‌వీఆర్ ప్రైవేట్ ట్రావెలింగ్ బస్సు శనివారం సాయంత్రం 5 గంటలకు జగిత్యాల నుంచి 30 మంది ప్రయాణికులతో పాటు ఇద్దరు డ్రైవర్లు, ఒక క్లీనర్‌తో ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా పామూరుకు బయలుదేరింది. ఈ క్రమంలో ఆదివారం తెల్లవారుజామున సుమారు 3 గంటల ప్రాంతంలో మండల కేంద్రంలోని ఎన్నెస్పీ కాలనీ సమీపానికి రాగానే బస్సు ముందు ఎడమ టైర్ పేలింది. దీంతో ఒక్కసారిగా అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని రోడ్డు అవతలకు వెళ్లి బోల్తా కొట్టింది. విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని స్వల్పంగా గాయపడిన ప్రయాణికులను తక్షణమే వేరే బస్సులో వారి గమ్యస్థానాలకు తరలించారు. అనంతరం భారీ క్రేన్ సహాయంతో బస్సును లేపి రోడ్డు పక్కకు పెట్టినట్లు పోలీసులు తెలిపారు.

దేవరకొండ ఆస్పత్రిలో ఆరుగురు ఉద్యోగుల సస్పెన్షన్

- విధులకు గైర్హాజర్ అయిన ఆసుపత్రి ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై చర్యలు
- ఆదేశాలు జారీ చేసిన అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర

దేవరకొండ, ఆగస్టు 25: దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిలో విధులకు గైర్హాజర్ అయిన ఆరుగురు అవుట్ సోర్సింగ్ ఉద్యోగులపై వేటుపడింది. దేవరకొండ ప్రభుత్వ ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ ఆదివారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 24వ తేదీన నల్లగొండ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర దేవరకొండ ప్రభుత్వ ప్రాంతీయ ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. రోగుల సమస్యలను డాక్టర్లు, సిబ్బంది వివరాలను అడిగి తెలుసుకున్నారు. నలుగురు శానిటేషన్ సూపర్‌వైజర్లు, ఇద్దరు సిబ్బంది విధులకు గైర్హాజరయ్యారు. దీంతో విధుల పట్ల నిర్లక్ష్యం వహించిన శానిటేషన్ సూపర్‌వైజర్లు అభిషేక్, అజయ్‌కుమార్, సీతారాం, అమృత, సిబ్బంది జయమ్మ, జ్యోతిలను సస్పెండ్ చేస్తూ జిల్లా అదనపు కలెక్టర్ పూర్ణచంద్ర ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆసుపత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ మంగ్తానాయక్ తెలిపారు.

ఉత్తరాపల్లికి అర్చక సామ్రాట్ పురస్కారం



అవార్డు అందుకుంటున్న నర్సింహాచార్యులు

నార్కట్‌పల్లి, ఆగస్టు 25: తెలుగు సంస్కృతి సేవా ట్రస్టు ప్రతీ యేటా ఉత్తమ అర్చకులకు ఇచ్చే అవార్డుకు ఈ పర్యాయం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలంలోని మాంద్ర గ్రామానికి చెందిన ఉత్తరాపల్లి నర్సింహాచార్యులు ఎంపికయ్యారు. గ్రామీణ నేపథ్యంలో పౌరోహిత్యం, అర్చకత్వంలో విశేష సేవలందిస్తున్న నర్సింహాచార్యులకు అర్చక సామ్రాట్‌తో పాటు జీవ సాఫల్య పురస్కారాన్ని ప్రకటించగా దేవదాయ ధర్మాదాయ శాఖ పరిధిలోని ఆలయాల్లో పనిచేసే ఈవోల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అద్దంకి నాగేశ్వర్‌రావు అవార్డును అందజేశారు. నర్సింహాచార్యులకు అవార్డు రావడంపై పలువురు పురోహితులు హర్షం వ్యక్తం చేశారు.

తారు రోడ్డు పనులు ప్రారంభం


డబుల్ రోడ్డుపై వేస్తున్న తారు

శాలిగౌరారం, ఆగస్టు 25: నకిరేకల్ నుంచి గురజాల వరకు ఉన్న ఆర్అండ్‌బీ ప్రధాన రోడ్డులో శాలిగౌరారం నుంచి రామగిరి వరకు ఉన్న గుంతలమయంగా ఉన్న సింగిల్‌రోడ్డులో తారు రోడ్డు పనులు ప్రారంభమయ్యాయి. నిత్యం ఎంతో వాహనాల రద్దీతో ఉండే శాలిగౌరారం నుంచి రామగిరి వరకు ఉన్న రోడ్డు పెద్ద పెద్ద అగాధాల కారణంగా ప్రయాణికులు, వాహన చోదకులు ఇబ్బంది పడుతున్నారు. గతేడాది ఈ రోడ్డును డబుల్ రోడ్డుగా నిర్మించేందుకు రూ.5కోట్లు మంజూరయ్యాయి. మూడు నెలల క్రితం పనులు ప్రారంభించారు. ఇప్పటికే రోడ్డు నిర్మాణానికి సంబంధించిన మట్టి, కంకర పనులు పూర్తికావడంతో బీటీ వేసే పనులు ప్రారంభించారు. ఈ రోడ్డు నిర్మాణంలో భాగంగా శాలిగౌరారం బస్టాప్ సమీపంలో బాక్స్ బ్రిడ్జి, రామగిరిలో 400మీటర్ల పొడవు సీసీతో డబుల్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. ఆర్అండ్‌బీ ఏఈఈ సంతోష్ కుమార్, సూపర్‌వైజర్ అంజయ్య పనులను పర్యవేక్షణ చేస్తున్నారు. డబుల్ రోడ్డు పనులు చకాచకా పూర్తి కావడంతో ఈ ప్రాంత ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

షరతులు లేకుండా రైతులకు రుణమాఫీ చేయాలి

● రైతుసంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఖైమనుద్దీన్

డిండి, ఆగస్టు 25: రైతులు బ్యాంకుల నుంచి తీసుకున్న వ్యవసాయ రుణాలను షరతులు లేకుండా మాఫీ చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఖైమనుద్దీన్ అన్నారు. డిండి మండల కేంద్రంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రూ.2లక్షలకు పైగా ఉన్న రుణాలను చెల్లించిన వారికి మాత్రమే రుణమాఫీ వర్తింపజేస్తామని షరతులు విధించడం సరికాదన్నారు. కేవలం ఇప్పటికీ 50శాతం రైతులకు మాత్రమే రుణమాఫీ అయిందని తెలిపారు. తమకు ఎందుకు రుణమాఫీ కాలేదో తెలియక తమ పనులను వదులుకొని వ్యవసాయశాఖ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు. వ్యవసాయ కార్యాలయాల వద్ద సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. డిండి ప్రాజెక్టును కల్వకుర్తి ఎత్తిపోతల నీటితో నింపి ఈ వానకాలం డిండి ప్రాజెక్టు ఆయకట్టులో సాగు చేసిన వరి పంటలను కాపాడాలని కోరారు. ప్రజాప్రతినిధులు అందుకు చొరవచూపాలన్నారు. రుణమాఫీకి విధించిన షరతులు సడలించని పక్షంలో రైతుసంఘం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు.

త్రిపురసుందరీదేవి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలి


త్రిపురసుందరీదేవి ఉత్సవంలో పాల్గొన్న మాజీ జడ్పీటీసీ, ఎంపీపీలు

తిప్పర్తి, ఆగస్టు 25: త్రిపురసుందరీదేవి ఆశీస్సులు ప్రజలందరికీ ఉండాలని మాజీ జడ్పీటీసీ పాశం రాంరెడ్డి అన్నారు. ఆదివారం తిప్పర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని తిప్పలమ్మగూడెం గ్రామ త్రిపురసుందరీదేవి ఉత్సవాల సందర్భంగా మాజీ ఎంపీపీ నాగులవంచ విజయలక్ష్మీలతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం త్రిపురసుందరీ దేవి అమ్మవారి ఊరేగింపు ఉత్సవాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి వెంకట్‌రెడ్డి గత ఎన్నికల ప్రచారాన్ని త్రిపురసుందరీదేవి ఉత్సవాలలోనే ప్రారంభించారని అమ్మవారి ఆశీస్సులతోనే భారీ మెజార్టీతో ఎమ్మెల్యేగా గెలుపొంది మంత్రిగా ప్రమాణస్వీకారం చేశారని గుర్తు చేశారు. ప్రచారంలో తిప్పర్తి గ్రామ పంచాయతీని మోడల్ పంచాయతీగా మార్చుతానని చెప్పిన మాట ప్రకారం మండల కేంద్రంలోని అభివృద్ధి కోసం రూ.8కోట్ల నిధులతో పనులు ప్రారంభించుకున్నామని తెలిపారు. అదే విధంగా అమ్మవారి ఆశీస్సులు మండల ప్రజలందరిపై ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆయన వెంట మండల యూత్ అధ్యక్షుడు బద్దం సుధీర్, మాజీ సర్పంచ్ జాకటి మోష, నాయకులు కిన్నెర అంజి, నలపరాజు శ్రీనివాస్, ఆదిమూళ్ల ప్రశాంత్, కుక్కల రమేష్‌రెడ్డి, గుండెబోయిన సైదులు, గుర్రం శ్రీనివాస్‌రెడ్డి, సోమరాజు, జగన్‌రెడ్డి, గిరి, వెంకన్న, జావీద్ తదితరులు పాల్గొన్నారు.

మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలి

మిర్యాలగూడ రూరల్, ఆగస్టు 25: మండలంలోని కురియాతండాలో మూడు నెలలుగా గుడిసెలు, గడ్డివాములు దగ్ధమవుతున్నాయన్న విషయం తెలుసుకొని జేవీవీ, ప్రజాసంఘాల నాయకులు ఆదివారం గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు జేవీవీ, ప్రజా సంఘాల నాయకులు మాట్లాడుతూ ప్రజలు మూఢనమ్మకాలకు దూరంగా ఉండాలని, మంతతంత్రాలను నమ్మి ఆర్థికంగా, మానసికంగా నష్టపోవద్దని, శాస్త్రీయంగా ఆలోచించి తగు నివారణ చర్యలు చేపట్టాలన్నారు. త్వరలో గ్రామంలో మూఢ నమ్మకాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ రాజు, కోల శ్రీనివాస్, కస్తూరి ప్రభాకర్, కొండల్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, కుందుకూరి సుదర్శన్, ధనావత్ ధనావత్ సూర్య, ధనావత్ థావు, బలరాం, మహేష్, హరి, వాల్య, తేజ, బబ్రు తదితరులు పాల్గొన్నారు.

కులగణన వెంటనే ప్రారంభించాలి : జాజుల

చండూరు, ఆగస్టు 25: రాష్ట్రంలో సమగ్ర కులగణనను వెంటనే ప్రారంభించి, బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. కులగణన కోసం ఈ నెల 26వ తేదీన నిర్వహించనున్న కలెక్టరేట్ల ముట్టడి శ్రీకృష్ణ జన్మాష్టమి కారణంగా సెప్టెంబరు 2కు వాయిదా వేసినట్లు ఆయన తెలిపారు. కలెక్టరేట్ల ముట్టడిలో రాజకీయ పార్టీలకతీతంగా బీసీలంగా స్వచ్ఛందంగా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కులగణన నిర్వహించే వరకు బీసీ ఉద్యమాన్ని ఆపేది లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కులగణను ప్రారంభించి బీసీ రిజర్వేషన్లు పెంచాలని జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు.

ముత్యాలమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు

నకిరేకల్, ఆగస్టు 25: నకిరేకల్‌లోని తాటికల్ రోడ్డులోని ముత్యాలమ్మ ఆలయంలో పలువురు నాయకులు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రతి ఆదివారం, గురువారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నందున భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ముత్యాలమ్మవారిని దర్శించుకోవాలని ఆలయ కమిటీ చైర్మన్ గంగాధర యోగానందం తెలిపారు. ప్రత్యేక పూజలు నిర్వహించిన వారిలో కాంగ్రెస్ పార్టీ నాయకులు దైద రవీందర్, పన్నాల రాఘవరెడ్డి, మురారిశెట్టి కృష్ణమూర్తి, చౌగోని శ్రీను, శివాలయం, కాళికామాత చైర్మన్లు ఉప్పల రమేష్, బ్రహ్మదేవర రవిశంకర్, చౌగోని సైదులు, యాసారపు వెంకన్న, మునిసిపల్ కౌన్సిలర్లు ఘర్షకోటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ అమలు చేయాలి : సీపీఎం


సమావేశంలో మాట్లాడుతున్న ప్రమీల

శాలిగౌరారం, ఆగస్టు 25: ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ రుణమాఫీ చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యురాలు కందాల ప్రమీల డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో జరిగిన సీపీఎం కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం ఎలాంటి షరతులు లేకుండా ప్రతీ రైతుకు రూ.2లక్షల రుణమాఫీ చేయాలని అన్నారు. నిరసనగా ఈ నెల 27వ తేదీన కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాలో రైతులు అధిక సంఖ్యలో పాల్గొనాలని అన్నారు. రైతుల రుణాలు మాఫీ చేసే వరకు దశల వారీగా ఆందోళన కార్యక్రమాలు, ఉద్యమాలు నిర్వహిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో పార్టీ మండల కార్యదర్శి చలకాని మల్లయ్య, నాయకులు కారింగుల వెంకన్న, బుచ్చిరాములు, లింగయ్య, సైదులు, శ్రీను, రామచంద్రులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి పవర్ లిఫ్టింగ్ పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్, ఆగస్టు 25: జిల్లా పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఫిట్‌నెస్ క్లబ్‌లో జిల్లా స్థాయి జూనియర్, సీనియర్ పోటీలను నిర్వహించారు. 53 నుంచి 83 కిలోల బరువు గల క్రీడాకారులు పోటీలో పాల్గొన్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. ప్రతిభ కనబర్చిన క్రీడాకారులు ఈ నెల 31వ తేదీన రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు నిర్వాహకులు ఎంపిక చేశారు. కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ జు నైద్ హష్మీ, అఫ్రోజ్ అహ్మద్, రిజ్వాన్, గిరి, కార్తీక్, పర్వేజ్ అఫ్రోజ్, ఫహీం పాల్గొన్నారు.

వైభవంగా భక్తి శ్రద్ధలతో బోనాల మహోత్సవం

నల్లగొండ కల్చరల్, మిర్యాలగూడ టౌన్, కట్టంగూరు, గుర్రంపోడు, ఆగస్టు 25: శ్రావణమాసం సందర్భంగా ఆదివారం పట్టణంలో పలు ప్రాంతాల్లో బోనాల మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. జిల్లా కేంద్రంలోని మాన్యంచెల్క, 11వార్డు వినాయక హౌజింగ్ బోర్డు, గోకుల్‌నగర్ ప్రాంతాల్లోని ముత్యాలమ్మ గుడిలో శ్రావణమాసం బోనాల పండుగను నిర్వహించారు. సంప్రదాయబద్ధంగా మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలను అలంకరించి వాయిద్యాల మధ్య ఊరేగింపుగా తీసుకువచ్చి అమ్మవారికి ఆ నైవేద్యాన్ని సమర్పించి మొక్కులు చెల్లించారు. ఊరేగింపుల్లో శివసత్తుల విన్యాసాలు, భక్తుల గీతాలు ఆకట్టుకున్నాయి. మహిళలు అధిక సంఖ్యలో బోనాలను తీయడంతో ఆయా ప్రాంతాలలోని ముత్యాలమ్మ ఆలయాలు సందడిగా మారాయి. కార్యక్రమంలో కత్తుల రమేష్, సంపత్, స్వామిగౌడ్, రవీందర్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● మిర్యాలగూడ పట్టణ ప్రజలు బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పందిర్లపల్లి చెరువు ఒడ్డున కొలువుదీరిన ముత్యాలమ్మతల్లి, వినోభానగర్, శివాలయం వీధిలోని అమ్మవార్లకు భక్తులు బోనాలు సమర్పించారు. ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి, మునిసిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్, నాయకులు గాయం ఉపేందర్‌రెడ్డి, నీరుకంటి నారాయణ, స్కైలాబ్ నాయక్ పలుచోట్ల జరిగిన అమ్మవారి పూజలకు హాజరయ్యారు.

● కట్టంగూరు గ్రామపంచాయతీ పరిధిలోని అంబేడ్కర్‌నగర్‌లో కాలనీవాసులు బోనాల పండుగను నిర్వహించారు. గ్రామ శివారులోని ముత్యాలమ్మకు బోనాలతో వెళ్లి నైవేద్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

● గుర్రంపోడు మండలంలోని కొప్పోలు గ్రామంలో ముత్యాలమ్మ తల్లికి బోనాలు సమర్పించారు. బోనాల సందర్భంగా కొప్పోలు గ్రామం కోలాహలంగా మారింది. ముత్యాలమ్మకు పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించారు. కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.


నల్లగొండ పట్టణంలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు


మిర్యాలగూడ: పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీఎల్ఆర్


కట్టంగూరు: అంబేడ్కర్‌నగర్‌లో బోనాలతో వెళ్తున్న మహిళలు


గుర్రంపోడు: కొప్పోలులో బోనాలతో వస్తున్న మహిళలు


నల్లగొండలో బోనాలు తీసుకెళ్తున్న మహిళలు

బీపీ మండల్ సిఫార్సులను అమలు చేయాలి

మిర్యాలగూడ, దేవరకొండ, ఆగస్టు 25: బిందేశ్వర ప్రసాద్ మండల్ కమిషన్ సిఫార్సులను అమలుచేయాలని బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సర్నాల వెంకన్న డిమాండ్ చేశారు. అన్నారు. జిల్లాలోని నల్లగొండ, మిర్యాలగూడ, దేవరకొండ పట్టణాల్లో బీపీ మండల్ జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ మండల్ కమిషన్ చైర్మన్‌గా దేశంలో అనేక ప్రాంతాలు పర్యటించి ఓబీసీలు ఎదుర్కొంటున్న సమస్యలపై 27 సిఫార్సులను కేంద్రప్రభుత్వానికి సమర్పించినట్లు తెలిపారు. వాటిలో కేవలం 27శాతం రిజర్వేషన్ అంశాన్ని మాత్రమే అమలుచేస్తున్నారని అన్నారు. జనాభాలో 56 శాతం ఉన్నటువంటి ఓబీసీలు రిజర్వేషన్లు, ప్రజాప్రతినిధుల్లో లేకపోవడం వల్ల అనేక ఓబీసీ కులాలు చట్టసభలకు రాకుండా చేశారని అన్నారు.


మిర్యాలగూడలో నివాళులర్పిస్తున్న నాయకులు


నల్లగొండలో నివాళులర్పిస్తున్న బీసీ సంఘం నాయకులు

● మిర్యాలగూడ పట్టణంలోని యాదవ సంఘం భవనంలో బీపీ మండల్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. సమావేశంలో యాదవ ఉద్యోగుల సంఘం డివిజన్ అధ్యక్షుడు గుడిపాటి కోటయ్య, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అశోక్, పట్టణ అధ్యక్షుడు కట్టెబోయిన శ్రీనివాస్‌యాదవ్, కార్యదర్శి పిన్నబోయిన శ్రీనివాస్, నాయకులు కాశీయాదవ్, నాగరాజు, సురేష్, కోటయ్య, శివకృష్ణ పాల్గొన్నారు.

● దేవరకొండలో బీసీ రిజర్వేషన్ పోరాట యోధుడు బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతిని ఎమ్మార్పీఎస్, ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించారు. దేవరకొండ అంబేడ్కర్ విగ్రహం ఎదుట బీపీ మండల్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల జేఏసీ జిల్లా అధ్యక్షుడు కంబాలపల్లి వెంకటయ్య, మారేపల్లి యాదిగిరి, చొల్లేటి భాస్కరచారి, మధు, నాగరాజు, నర్సింహచారి పాల్గొన్నారు.

ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాస భక్తుల రద్దీ


అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

కనగల్, ఆగస్టు 25: మండలంలోని దర్వేశిపురం స్టేజీవద్ద గల శ్రీరేణుకా ఎల్లమ్మ ఆలయానికి శ్రావణమాస భక్తుల రద్దీ కొనసాగుతుంది. ఆదివారం వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయంలో కుంకుమ అభిషేక పూజలు జరిపించి చీరసారె ఒడిబియ్యం సమర్పించుకున్నారు. పుట్టలో పాలు పోసి నాగ పడిగలకు మొక్కుకున్నారు. కోరికలు నెరవేరాలని ముడుపులు కట్టారు. కొంత మంది బోనాలతో వచ్చి ఇష్టదైవానికి భక్తిశ్రద్ధలతో నైవేద్యాలను అందించారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ సిబ్బంది తగు ఏర్పాట్లు చేశారు.

ఘనంగా కంచర్ల జన్మదిన వేడుకలు


కేక్‌ను కట్ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

నల్లగొండ, ఆగస్టు 25: మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలో ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వచనాలు, అభిమానులు, కార్యకర్తలు, సన్నిహితుల మధ్య కంచర్ల భూపాల్‌రెడ్డి భారీ కేక్‌ను కట్ చేశారు. అదేవిధంగా అనాథ శరణాలయాల్లో అన్నదాన కార్యక్రమాలు, గొల్లగూడ ఆస్పత్రిలో రోగులకు పాలు, పండ్లు, అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో జడ్పీ మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గాదరి కిషోర్, నిరంజన్ వలీ, చీర పంకజ్‌యాదవ్, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు బోనగిరి దేవేందర్, దేప వెంకట్‌రెడ్డి, అయితగోని యాదయ్య, మాలె శరణ్యారెడ్డి, నర్సిరెడ్డి, వంగాల సహదేవారెడ్డి, తండు సైదులుగౌడ్, లొడంగి గోవర్ధన్‌యాదవ్, మారగోని గణేష్, రావుల శ్రీనివాస్‌రెడ్డి, జమాల్‌ఖాద్రీ, ఖైమనం శ్రీనివాస్, సత్యనారాయణ పాల్గొన్నారు.

దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి : బాలునాయక్


దేవరకొండ: పెద్దమ్మతల్లి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, ఆగస్టు 25: దేవాలయాల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. శ్రావణమాసం పురస్కరించుకొని దేవరకొండ పట్టణంలోని ముత్యాలమ్మబజార్‌లో పెద్దమ్మతల్లి ఆలయాన్ని ఆదివారం ఆయన దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించి మాట్లాడారు. పెద్దమ్మతల్లి దయవల్ల వర్షాలు సంవృద్ధిగా కురువాలని, ప్రాజెక్టులు, చెరువులు నిండాలని, రైతులకు పాడిపంటలు పండాలని పెద్దమ్మతల్లిని వేడుకున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో మునిసిపల్ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, మాజీ ఎంపీపీ జాన్‌యాదవ్, నాయకులు నాయిని మాధవరెడ్డి, పున్న వెంకటేశ్వర్లు, శ్రీశైలం యాదవ్, నేతాళ్ల వెంకటేష్, మల్లయ్య యాదవ్, సైదులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఆలయకమిటీ నిర్వాహకులు ఎమ్మెల్యే బాలునాయక్‌ను ఘనంగా సన్మానించారు.

దైవచింతనతోనే మానసిక ప్రశాంతత

చందంపేట: ప్రతి ఒక్కరూ దైవభక్తిని కలిగి ఉండాలని, దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఎమ్మెల్యే బాలునాయక్ అన్నారు. నేరేడుగొమ్ము మండలం పెద్దమునిగల్ శ్రీ లక్ష్మీ చెన్నకేశవసహిత అంకాలమ్మ జాతర ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గంగహారతి ఇచ్చి మాట్లాడారు. అంకాలమ్మ దీవెనల వల్ల అంతా మంచి జరగాలని, పంటలు పండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు ఎం.ఎ.సిరాజ్‌ఖాన్, లోకసాని కృష్ణయ్య, ముక్కమళ్ల వెంకటయ్య, బాలునాయక్, యుగేందర్‌రెడ్డి, నాయిని మాధవరెడ్డి, గోవిందు, హరికృష్ణ, లచ్చిరాంనాయక్, నిర్వాహకులు పాల్గొన్నారు.

● దైవచింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని పీసీసీ సభ్యుడు, పీఏసీఎస్ చైర్మన్ జాల నర్సింహారెడ్డి అన్నారు. చిత్రియాలలో నిర్వహించిన పెద్దమ్మతల్లి, అంకాలమ్మతల్లి పండగ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామ దేవతల పండగలు సంప్రదాయానికి నిదర్శనమని అన్నారు. కార్యక్రమంలో తిరుపతయ్య, అంకులు, మహేష్, ఆంజనేయులు పాల్గొన్నారు.

గంజాయిని తాగితే కఠిన చర్యలు తప్పవు


దామరచర్ల : కార్మికులకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ రవి

దామరచర్ల, కొండమల్లేపల్లి, ఆగస్టు 25: ఎవరైనా గంజాయిని తాగినా, విక్రయించినా వారిపై కఠినచర్యలు తీసుకుంటామని వాడపల్లి ఎస్ఐ ఇరుగు రవి హెచ్చరించారు. యాదాద్రి పవర్ ప్లాంట్‌లోని వలస కార్మికులకు గంజాయి, మాదకద్రవ్యాలపై ఆదివారం అవగాహన కల్పించారు. గంజాయిని తాగి తమ భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, గంజాయి వంటి మాదకద్రవ్యాల బారిన పడితే నేరాలు చేస్తారని వాటి నియంత్రణకు పోలీసులకు సహకరించాలన్నారు. గంజాయిని అమ్మినా, తాగినా వారి వివరాలను టోల్‌ఫ్రీ నెంబర్ 8712670266కు సమాచారం అందించాలని, వారి వివరాలను గోప్యంగా ఉంచుతామన్నారు.

● కొండమల్లేపల్లి మండల కేంద్రంలో మిషన్ పరివర్తన్‌లో భాగంగా డ్రగ్స్, మాదక ద్రవ్యాల వాడకం, దుష్ప్రభావం అంశంపై ఎస్ఐ రామ్మూర్తి అవగాహన కల్పించారు. డ్రగ్స్, మాదక ద్రవ్యాల వాడకం, దుష్ప్రభావం అంశంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రవీణ్‌కుమార్, బాలాజీ పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి సహాయ నిధి పేదలకు వరం

చండూరురూరల్, ఆగస్టు 25: ముఖ్యమంత్రి సహాయ నిధి పథకం పేదలకు వరం లాంటిదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోరిమి ఓంకారం అన్నారు. ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన 23 కుటుంబాలకు రూ.6.94లక్షలు సీఎం సహాయనిధి ద్వారా విడుదలైనట్లు తెలిపారు. ఆ చెక్కులను ఆదివారం ఆయన లబ్ధిదారులకు అందజేసి మాట్లాడారు. పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేందుకు ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల తరుపున ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గుండ్రపల్లి మాజీ సర్పంచ్ భూతరాజు ఆంజనేయులు, నాయకులు వడ్డెగోని చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్గానిక్ ఉత్పత్తులతో ఆరోగ్యం : జైవీర్‌రెడ్డి

నాగార్జునసాగర్, ఆగస్టు 25: ఆర్గానిక్ ఉత్పత్తులు వాడితే ఆరోగ్యం కలుగుతుందని ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. సాగర్ హిల్‌కాలనీలో బాలవిహార్ వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్గానిక్ ఉత్పత్తుల సన్ఎడ్జ్ సూపర్ మార్కెట్‌ను ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. నేటి కల్తీయుగంలో ఆర్గానిక్ ఉత్పత్తులు వాడటం మేలన్నారు. ఈ ఉత్పత్తులు వాడటం వల్ల ఆరోగ్యం కలుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిడి కృష్ణరెడ్డి, పెద్దవూర పార్టీ మండల అధ్యక్షుడు పబ్బు యాదగిరి, నాయకులు తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, ప్రసాద్, మురళీకృష్ణ, శంకర్, మల్లిఖార్జున్‌రావు, రామకృష్ణ, విష్ణేష్ తదితరులు పాల్గొన్నారు.

అయోమయ ఉత్తర్వులపై స్పందించిన డీఈవో

● కొత్త మండల పదంపై పునఃపరిశీలించాలని ఎస్‌సీఈఆర్‌టీకి లేఖ

నార్కట్‌పల్లి, ఆగస్టు 25: 'డీఈవో ఉత్తర్వులతో అయోమయం'.. అనే శీర్షికన ఆదివారం 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన కథనంపై డీఈవో స్పందించినట్లు తెలిసింది. అమ్మనబోలును కొత్తగా ఏర్పాటైన మండలంగా ఎంఎన్‌వోల నియామకాల సందర్భంగా జారీ చేసిన ప్రొసీడింగ్స్‌లో పేర్కొనటంతో ప్రజలు అయోమయానికి గురైనట్లు పాఠకులకు తెలిసిందే. ప్రభుత్వం గెజిట్ విడుదల చేయకున్నా కేవలం విద్యాశాఖ మాత్రమే ఇలా కొత్తగా ఏర్పడిన మండలంగా అమ్మనబోలును గుర్తించడంపై ప్రజల్లో ఒకింత ఆశ్చర్యంతో పాటు రాజకీయంగా అనుమానాలకు తావిచ్చి చర్చకు దారితీసింది. ప్రజల్లో ఏర్పడిన అయోమయంపై స్థానిక విద్యాశాఖాధికారుల ద్వారా తెలుసుకున్న డీఈవో ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు లేఖ రాయనున్నట్లు తెలిసింది. ఎస్‌సీఈఆర్‌టీ అధికారులు అమ్మనబోలును నూతనంగా ఏర్పాటైన మండలంగా కార్యాలయ రికార్డుల్లో నమోదు చేసుకున్నారు. అయితే వాస్తవానికి అమ్మనబోలు నూతన మండలంగా అధికారికంగా ఏర్పడలేదు కనక వెంటనే పునఃపరిశీలించి కొత్తగా ఏర్పాటైన మండలం అనే పదం సవరించడం ద్వారా ప్రజల్లో ఉన్న సందేహాలకు నివృత్తి చేయాలని కోరుతూ ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్‌కు డీఈవో లేఖ రాయనున్నట్లు తెలిసింది.

సంక్షిప్త సమాచారం...

దేవరకొండ: దేవరకొండకు చెందిన వైద్య విద్యార్థి అఖిలేష్‌యాదవ్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందాడు. అఖిలేష్‌యాదవ్ చిన్ననాటి మిత్రులందరూ అతని జ్ఞాపకార్థం ప్రభుత్వ బాలుర పాఠశాల ఆవరణలో అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. అఖిలేష్‌యాదవ్ మృతి బాధాకరమని స్నేహితులు సంతాపం తెలిపారు. అతని పేరిట పలు సేవ కార్యక్రమాలు చేపడుతామని అఖిలేష్ మిత్రులు నరేందర్, శ్రీనివాస్ తెలిపారు.

చింతపల్లి: హైదరాబాద్ ఎల్‌బీనగర్ కామినేని ఆస్పత్రి సౌజన్యంతో చింతపల్లి మండలంలోని బోత్యాతండాల్లో ప్రజలకు వైద్య సిబ్బంది ఉచితంగా పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

చింతపల్లి: కేంద్రప్రభుత్వం పెట్టిన బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు అంగిరేకుల నాగభూషణ్ అన్నారు. రాష్ట్ర విభజన చట్టంలో పొందుపరిచిన హామీలను అమలుచేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని ఆయన ఆరోపించారు.

చందంపేట: చందంపేట మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడిగా నర్ర రామలింగారెడ్డి, ప్రధానకార్యదర్శి రమావత్ కిరణ్, ఉపాధ్యక్షుడిగా విక్రమ్ ఎన్నికైనట్లు పంచాయతీ కార్యదర్శులు తెలిపారు.

గుర్రంపోడు: నిరుపేదలకు ఎల్లప్పుడు ధర్మరక్ష ఫౌండేషన్ అండగా ఉంటుందని ఫౌండేషన్ అధ్యక్షుడు అనుముల నవీన్‌కుమార్ తెలిపారు. మండలంలోని కొప్పోలు గ్రామంలో అనారోగ్యంతో మృతి చెందిన గట్టుపల్లి యాదగిరిరెడ్డి కుటుంబానికి అనారోగ్యపాలైన పాలోజు అంజయ్యాచారి కుటుంబానికి రూ.5వేలు ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ గౌరవ సలహాదారు రామదాసు, కార్యదర్శి శంకర్‌నాయక్, కోశాధికారి నాగరాజు, గోవింద్‌నాయక్, లచ్చునాయక్ పాల్గొన్నారు.

చింతపల్లి: రుణమాఫీపై బీఆర్ఎస్ నాయకులు మతిభ్రమించిన మాటలు మాట్లాడుతున్నారని కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు అంగిరేకుల గోవర్ధన్ అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అన్నీ వర్గాల సంక్షేమానికి పథకాలు అమలు చేస్తుందని అన్నారు.

మునుగోడు: మునుగోడు హైస్కూల్‌లో 2002- 23లో పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థులు స్థానిక పాఠశాలలో సమావేశమయ్యారు. ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న పలువురు మిత్రులకు కొంత మొత్తంలో రూ. 1లక్ష అందజేశారు. ఆ డబ్బులను స్వచ్ఛందంగా ముందుకు వచ్చి విరాళంగా సమకూర్చినట్లు తెలిపారు.

చిట్యాలరూరల్: తమ స్నేహితుడు కష్టాల్లో ఉన్నాడని, మరో స్నేహితుడు అకాలమృతి చెందడంతో ఆ కుటుంబాలకు ఆర్థికసాయం అందించి స్నేహాన్ని చాటుకున్నారు. మండలంలోని వెలిమినేడుకు చెందిన మేడి సాయికుమార్ ప్రమాదవశాత్తు రోడ్డు ప్రమాదంలో గాయపడగా గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులంతా కలిసి రూ.35వేలను సేకరించారు. ఉరుమడ్ల గ్రామానికి చెందిన రూపని రవి గుండెపోటుతో మృతిచెందగా జడ్పీహెచ్ఎస్ పదో తరగతి పూర్వ విద్యార్థులు స్నేహితుడి కుటుంబానికి రూ.60వేల ఆర్థికసాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో జహంగీర్, మధ్యపురి శ్రీశైలం, మహంకాళి మహేష్ కుమార్, అంతటి నరేష్, పరమేష్, శ్రీను, సత్యనారాయణ పాల్గొన్నారు.

నల్లగొండ: అర్వపల్లి మండలం వర్ధమానుకోట గ్రామానికి చెందిన మట్టిపల్లి రామచంద్రుకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ప్రొఫెసర్ చెన్న కృష్ణారెడ్డి పర్యవేక్షణలో హీట్ అండ్ మాస్ ట్రాన్స్‌ఫర్ అనాలిసిస్‌తో పాటు వివిధ అంశాలపై పరిశోధన చేసిన గ్రంథాన్ని సమర్పించినందుకు ఉస్మానియా యునివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించింది. వందేళ్ల చరిత్ర ఉన్న ఉస్మానియా యూనివర్సిటీ నుంచి పట్టా అందుకోవడంపై పలువురు రామచంద్రును అభినందించారు.

నార్కట్‌పల్లి: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని నార్కట్‌పల్లిలో యాదవులు తమ కులదైవమైన లింగమంతుల స్వామికి బోనాలు సమర్పించారు. సంప్రదాయ నృత్యాలతో బోనాలను శిరస్సుపైన ధరించిన మహిళలు ప్రదర్శనగా కుంచలాయి గుట్ట కింద ఉన్న లింగమంతులస్వామి గుడికి వెళ్లి బోనం నైవేద్యాన్ని సమర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే, మాజీ ఎమ్మెల్యేలు వేముల వీరేశం, చిరుమర్తి లింగయ్య, నాయకులు దూదిమెట్ల సత్తయ్య, బత్తుల ఊశయ్య, వడ్డే భూపాల్‌రెడ్డి, భరత్, శ్రీనివాస్, బొబ్బిలి శ్రవణ్, దేవేందర్, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

శాలిగౌరారం: రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అమలు కానీ అబద్ధపు హామీలతో గద్దెనెక్కి ప్రజలను మోసం చేస్తుందని బీజేపీ మండల అధ్యక్షుడు జమ్ము రమేష్ అన్నారు. ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీజేపీ ఆధ్వర్యంలో తహసీల్దార్ యాదగిరికి వినతిపత్రం సమర్పించారు. రైతు రుణమాఫీ పూర్తి చేయకుండా మాటల గారడీతో కాలం గడుపుతుందని ఆరోపించారు. జూన్‌లో వేయాల్సిన రైతు భరోసా ఇంత వరకు రైతుల ఖాతాల్లో జమ చేయలేదని, వెంటనే రూ.2లక్షల లోపు రుణమాఫీ చేసి, రైతు భరోసాను రైతుల ఖాతాల్లో వేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లి రాములు, తోట వినోద్‌కుమార్, భాషబోయిన వెంకన్న, సయ్యద్, సురేష్‌రెడ్డి, సురేష్‌గౌడ్ పాల్గొన్నారు.

ఘనంగా కృష్ణాష్టమి వేడుకలు


గోపిక వేషధారణలో చిన్నారి

చింతపల్లి, ఆగస్టు 25: కృష్ణాష్టమిని పురస్కరించుకొని చింతపల్లి మండలంలోని పోలేపల్లిరాంనగర్ గ్రామశివారుల్లోని బ్లూమ్ పాఠశాలలో ఆదివారం కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ మహమ్మద్ మన్సూర్‌ఖాన్, హుస్సేన్ పాల్గొన్నారు.

● గొడుకొండ్లలోని శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో 27వ తేదీన వైష్ణవ సంప్రదాయ ప్రకారం కృష్ణాష్టమిని నిర్వహిస్తున్నట్లు చైర్మన్ అంగిరేకుల గోపాల్ తెలిపారు.

నల్లగొండరూరల్: కృష్ణాష్టమి సందర్భంగా నల్లగొండ పట్టణంలోని శివాజీనగర్‌కు చెందిన రమావత్ వర్షిక అనే చిన్నారి గోపిక అలంకరణలో సందడి చేసింది.